

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

గురువారం 21 ఆగస్టు 2025

పేజీలు 11




- 83 దుంగలతో పాటు లారీ స్వాధీనం.. ఒక స్మగ్లర్ అరెస్టు
- కావలి పోలీసుల సహకారంతో భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- సిబ్బంది పైకి దూసుకువచ్చిన లారీ.. సాహసోపేతంగా అడ్డుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

## రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల పట్టివేత

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్ :** విజయవాడ – చెన్నై రహదారిలో లారీలో అక్రమంగా తరలిస్తున్న దాదాపు రెండున్నర టన్నుల ఎర్రచందనం దుంగలతో పాటు లారీని స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లరును టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆదేశాలతో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ ఎస్ ఐ కేవెస్ కె. లింగాధర్ టీమ్ మంగళవారం రాత్రి విజయవాడ – చెన్నై రహదారిలోని కావలి ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమ రవాణా మిగతా 4లో..








## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

**తిరుమల, మేజర్‌న్యూస్,** సెప్టంబర్ 24వ తేది నుండి అక్టోబర్ 2వ తేది వరకు తిరుమలలో నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో చేస్తున్న ఏర్పాట్లను టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యాలరీల్లో భక్తులు ఇబ్బంది పడకుండా వాహన సేవలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని ఈవో అధికారులను ఆదేశించారు. సెప్టంబర్ మొదటి వారంలోపు ఇంజినీరింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఈవో మీడియాతో సెప్టంబర్ 24వ తేది ధ్వజారోహణం మిగతా 5లో..





## హంద్రీనీవా పనులను పరిశీలించిన కలెక్టర్

### కుప్పంలో కలెక్టర్ సుమిత్ కుమార్ సుడిగాలి పర్యటన

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం నియోజకవర్గంలోని చివరి చెరువు అయిన పరమసముద్రం చెరువు నందు హంద్రీ నీవా పనులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. బుధవారం కుప్పం నియోజక వర్గంలో జరిగే పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరమ సముద్రం చెరువు వద్ద జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హంద్రీ–నీవా జలాలతో కుప్పం నియోజకవర్గంలోని 430 చెరువులు నింపనున్నారు. ఈ నేపథ్యంలో చెరువుల సామర్థ్యం, చెక్ డ్యాంలను బాగు చేయడం, నీటినిల్వలో ఎలాంటి లోపాలు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లు ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని తెలిపారు. పరమ సముద్రం చెరువు నందు బహిరంగ సభ, జల హారతి, పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ తెలుగు గంగా ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎమ్ ఎల్ ఎన్ వరప్రసాద్, హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ ఈ విటల్ ప్రసాద్, కుప్పం హెచ్ఎన్ ఎస్ ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే గోవర్ధన గిరిధర రావు, రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రామచంద్రారెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.




## పూర్ణాహుతితో ఘనంగా ముగిసిన సంగోపాంగ శ్రీ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం

## శాంతిపురం టిడిపి అధ్యక్ష పగ్గాలు ఎవరికో?





**శాంతిపురం, మేజర్‌న్యూస్** శాంతిపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష బాధ్యతలు టిడిపి పార్టీ అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందో వేచి చూడాలి. బుధవారం ఉదయం నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఐ వి ఆర్ ఎస్ ద్వారా శాంతిపురం మండల అధ్యక్ష అభ్యర్థులుగా ఉదయ్ కుమార్, ఆర్ ఎస్ మని పేర్లు వినిపిస్తున్నాయి, వీరిద్దరిలో మండల అధ్యక్షులుగా ఎవరు ఉంటే బాగుంటుందని సమాచారాన్ని సేకరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు అధిష్టానం వీరిద్దరిలో ఎవరికి అవకాశం కల్పిస్తుందో వేచి చూడాలి.



## శివుని సేవలో సోము వీర్ బాబా కాళిదాసు

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్:** భారతదేశంలోని 18 మండలాధీసుల్లో ఒకరైన హర్యానాకు చెందిన సోమువీర్ బాబా కాళిదాసు బుధవారం శ్రీకాళ హస్తీశ్వర ఆలయాన్ని సందర్శించారు. శిష్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన బాబా కాళిదాసుకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులతో పాటు ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి అయితా మురళీకృష్ణ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని నేతకుప్పంలో వెలిసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో స్వామి అమ్మవార్లకు కళ్యాణోత్సవం నిర్వహించారు స్వామి వార్లకు గ్రామస్తులు వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు తాలంకరించారు అభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలతో నూతన వస్త్రాలు నూతన వస్త్రాలతో స్వామివారిని దేదీప్యమనంగా అలంకరించారు రాజేష్ స్వామి వేదమంత్రాచార్యులు కళ్యాణ కళ్యాణోత్సవ తంతు పూర్తి చేశారు ఉభయదారులుగా ఆక హరి ప్రకాష్ దంపతులు వ్యవహరించారు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

## ఓబిసికి ఉపరాష్ట్రపతి పట్టం కట్టిన ఎన్డీఏ కూటమి



**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** ఓబిసి వర్గానికి చెందిన వ్యక్తిని ఉప రాష్ట్రపతిగా ఎన్నిక చేసిన ఘనత ఎన్డీఏ కూటమి నాయకులకి చెల్లిందని చిత్తూరు జిల్లా అధ్యక్షులు జగదీశ్వర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో అనేక రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలందించిన ఓబీసీ వర్గానికి చెందిన తమిళనాడు వాస్తవ్యులైన సిపీ రాధాకృష్ణన్‌ని భారత ఉపరాష్ట్రపతి అభ్యర్థి గా ఎన్నిక చేసిన ఘనత ఎన్డీఏ నేతలకి, బిజెపి కేంద్ర అధినాయకత్వానికి చెల్లిందని అన్నారు. బలహీన వర్గానికి చెందిన అభ్యర్థి పై పోటీ చేయించిన కాంగ్రెస్ పార్టీ అధినాయకుల కుటిలత్వ నిర్ణయం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

## ఖచ్చితమైన సరిహద్దుల కోసమే భూముల రీ సర్వే : ఆర్డీవో భవాని



**చౌడపల్లి రూరల్, మేజర్ న్యూస్:** ఖచ్చితమైన సరిహద్దుల కోసమే భూముల రీ సర్వే చేస్తున్నట్లు పలమనేరు ఆర్డిఓ భవాని అన్నారు. బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో భూమి రీ సర్వే పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ రెవిన్యూ గ్రామాల సర్వే అవుతుందని తర్వాత ప్రభుత్వ భూమి అనగా చెరువులు , వాగులు, వంకలు , వంటివి రీ సర్వే చేస్తారన్నారు. ఆటో తర్వాత రైతులకు సంబంధించిన పట్టాలు సర్వే అవుతాయన్నారు. ఈ తంతు అంతా మూడు నెలల్లో ముగిసేలా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. రీ సర్వేను సమగ్రవంతంగా చేపట్టి అనుకున్న కాల పరిమితులో అందించాలని సూచించారు. అనంతరం రీ సర్వే అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పార్వతి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### -డిప్యూటీ సీఈఓ



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** పిజిఆర్‌ఎస్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చిత్తూరు డిప్యూటీ సీఈఓ డాక్టర్ వెంకటనారాయణ ఆదేశించారు. బుధవారం వెదురు కుప్పం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ సమాచార హక్కు దరఖాస్తులకు నిర్దేశించిన సమయం లోపు సమాచారం సంబంధిత సిబ్బంది అందజేయాలని కోరారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజు ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం సక్రంగా నిర్వహించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ పురుషోత్తం, ఏవో నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

## గడ్డంవారిపల్లి సర్పంచ్ భాగ్యవతికి ఘన సన్మానం



**చౌడేపల్లి రూరల్, మేజర్ న్యూస్:** స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఢిల్లీ ఎర్రకోటలో అరుదైన అవార్డు అందుకున్న గడ్డం వారి పల్లి సర్పంచ్ భాగ్యవతి హరినాథ్ స్థానిక వైకాపా నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణంలోని జంగాల పల్లి రమణ భవనంలో వైకాపా మండల అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ పంచాయతీ నుంచి ఢిల్లీ స్థాయిలోకి వెళ్లి అవార్డు తీసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అవార్డు రావడం పట్ల రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పి మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డిలకు సర్పంచ్ భాగ్యవతి హరినాథ్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రుక్మిణమ్మ, పార్టీ ఉపాధ్యక్షుడు జంగాలపల్లి రమణ, ఎంపీటీసీ తొండ శ్రీరాములు, సర్పంచులు కృష్ణారెడ్డి, సుబ్రమణ్యం రాజు చెంగారెడ్డి, పవన్ రాయల్ ,భాస్కర్ అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విషసర్పం కాటేసిన వ్యక్తికి అస్వస్థత



**చౌడేపల్లి రూరల్, మేజర్ న్యూస్:** విష సర్పం కాటేసిన వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటుచేసుకుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజు అనే మేస్త్రి స్థానికంగా ఓ ఇంటిలో మేస్త్రి పని చేస్తుండగా కృష్ణ సర్పం కాటేసింది. గుర్తించిన అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి సిఫారసు చేశారు.

## ట్రాక్టర్ ను ఢీకొన్న మోటార్ సైకిల్

### - ఇద్దరికి తీవ్ర గాయాలు

**నాయుడుపేట,మేజర్ న్యూస్:** నాయుడుపేటలోని స్వర్ణముఖి కాజువే వద్ద ట్రాక్టర్ ను మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో మేనకూరు ప్రాంతానికి చెందిన శరవణ, సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. శరవణ, సాయిలు మోటార్ సైకిల్‌పై నాయుడుపేట నుంచి మేనకూరుకు వెళుతున్న క్రమంలో స్వర్ణముఖి కాజువే వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకొని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## వినాయక ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

**చౌడపల్లి రూరల్, మేజర్‌న్యూస్:** వినాయక ఉత్సవాలకు అనుమతుల కోసం అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వహకులు వెబ్సైటును ఉపయోగించి సింగల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చునున్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్ కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు మాత్రమే ఈ అనుమతులు తప్పనిసరి అన్నారు.

## ఎం.వి.ఎస్.ఎన్ రాజుకు ఆనంద్ గౌడ్ సన్మానం



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్** ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ ఎం.వి. ఎస్.ఎన్ రాజును విజయవాడలోని వారి నివాసంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ శ్రీవారి ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరిం చారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబును ముందుండి నడిపించే సత్యనారాయణ రాజు కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో రాజు పార్టీకి మరింత సేవ చేస్తూ ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.. ఎస్ఎఫ్ఐ

**తడ, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం గడుస్తున్న విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీగా తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వం బాలురకు మరియు బాలికలకు హాస్టల్ విద్యార్థులకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు స్థలం కేటాయించి క్రీడలు నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు 6500 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, అర్హులైన వారికి తల్లికి వందనం 15 వేల రూపాయలు ఎటువంటి షరతులు లేకుండా ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విలీనాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తడ సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## వినాయకుని మండపాలకు అనుమతి తప్పనిసరి

**-ఎస్సై ధనుంజయ రెడ్డి**



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు పోలీసుశాఖ నుండి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ ధనుంజయ రెడ్డి తెలిపారు. బుధవారం రాజుపల్లి గ్రామంలో గ్రామస్తులతో వినాయక మండపాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ వారు స్థానిక పెద్దపంజాణి పోలీస్ స్టేషన్లో సంప్రదించి అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎస్సై పరిశీలించారు.

## దోమలను నిర్మూలిద్దాం - ప్రజలను కాపాడుదాం




**యాదమరి, మేజర్‌న్యూస్:** దోమలను నిర్మూలించి వాటివలన వచ్చే జబ్బులు నుంచి ప్రజలను కాపాడుకుందామని డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు.బుధవారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్సీలో మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ కాటు వలన ప్రాణాంతక జబ్బులు వ్యాప్తి చేందుతాయన్నారు.దాని నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరూ భాధ్యత తీసుకోవాలని చెప్పారు.మూడు రకాల దోమలు ఐదు రకాల ప్రాణాంతక జ్వరాలు కు కారణమవుతుందని అన్నారు.మలేరియా,డెంగ్యూ,చికెన్ గున్యా,మెదడు వాపు తదితర జ్వరాలు వస్తాయన్నారు.వాటి నివారణ కొరకే ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తున్నామని అన్నారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసమూర్తి,హెల్త్ సూపర్వైసర్స్,మహిళా ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి కుట్రలకు తలొగ్గని ధీరుడు కాకాణి

**: సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి**



**చిట్టమూరు మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వంలో నిర్బంధాలు, దౌర్జన్యాలు, కుట్రలకు ఎదురొడ్డి నిలబడ్డ ధీరుడు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బెయిల్ మంజూరై బుధవారం విడుదలైన కాకాణిని నెల్లూరులో కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసే సాదర స్వాగతం పలికారు.అక్రమ అరెస్టులతో సుమారు 85 రోజులు జైల్లో నిర్బంధాలకు గురిచేసినా మొక్కవోని పట్టుదల,దీక్షతో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రెట్టించిన ఉత్సాహంతో అలుపెరగని పోరాటం చేస్తామని ప్రకటించిన కాకాణి తెగువ అనన్య సామాన్యమన్నారు.ప్రజా సంక్షేమం,పార్టీ పటిష్టతే లక్ష్యంగా పనిచేస్తామన్న కాకాణిని సన్నారెడ్డి అభినందించారు.సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డితో పాటు గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షులుమాచిరెడ్డి సుధీర్ రెడ్డి,ఈశ్వరవాక సచివాలయ మాజీ కన్వీనర్ యల్లా చెంచు పుట్టబాబులు కాకాణిని కలిసిన వారిలో ఉన్నారు.

## వినాయక ప్రతిమ ప్రతిష్టకు అనుమతులు తప్పనిసరి



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** వినాయక చవితిని పురస్కరించుకొని వీధుల్లో వినాయక ప్రతిమ ఏర్పాటుకు పోలీసు శాఖ నుండి అనుమతులు తప్పనిసరి అని సర్కిల్ ఇన్స్పెక్టర్ యస్. హనుమంతప్ప తెలిపారు. బుధవారం ఉదయం సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక ప్రతిమ ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలీస్ శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని సీఐ వివరించారు. అలాగే వినాయక మండపాల వద్ద డిజె మ్యూజిక్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, ఎవరు డీజే మ్యూజిక్‌ను పెట్టేందుకు అనుమతి లేదని సీఐ వివరించారు. వై నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోబడుతుందని ఆయన హెచ్చరించారు.

## సదాశివేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజ



**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** చెరువు వద్ద వెలసిన శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు మంత్రోచ్ఛారణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కోదండపాణి మొదలియార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, ముఖ్య కార్యనిర్వహణ అధికారి బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు ప్రసాద్ రాజు, ప్రసాద్‌యాదవ్, ప్రసాద్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్బరాయులుయాదవ్, కృష్ణస్వామిరాజు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు తనిఖీ



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని నెలబల్లి, చిల్లకూరు, జీలపాటూరు పంచాయతీలలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ తనిఖీ చేశారు.అనంతరం ఉపాధి కూలీలతో ఆయన సమావేశమై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రక టించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి దినసరి కూలి రూ.300 పొందాలని, జాబ్ కార్డుల్లో ఒకరి పేరు మీద మరొకరు రాకూడదని, జాబ్ కార్డులో ఉన్నవారే ఉపాధి పనికి రావాలని, ఉదయం 6గంటల నుంచి 11గంటల లోపు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు.పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలతో పాటు మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.ఉపాధి హామీ కూలీలకు తప్పనిసరిగా క్షేత్ర సహాయకులు హాజరు ఐ రేస్ తో వేయాలని సూచించారు.

## భారత అణుశక్తి మిషన్ పురోగతిపై వివరాలు కోరిన ఎంపి గురుమూర్తి



**తిరుపతి రెవెన్యూ, మేజర్ న్యూస్:** చిన్న అణు రియాక్టర్ల పరిశోధన, అభివృద్ధి గురించి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంటులో ముఖ్యమైన సమాచారాన్ని కోరారు. 2025-26 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లతో ప్రకటించిన అణుశక్తి కార్యక్రమం ప్రస్తుత స్థితి, అలాగే తిరుపతి జిల్లాలోని ప్రముఖ విద్యా సంస్థలను ఈ పరిశోధనలో భాగం చేసే ఆలోచన ఉందా అని ఆయన ప్రశ్నించారు. ప్రాంతాలవారీగా భాగస్వామ్యం, అలాగే 2033 నాటికి దేశీయంగా అభివృద్ధి చేసే చిన్న అణు రియాక్టర్లను ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించే అవకాశం ఉందా అనే విషయాలను కూడా ఆయన అడిగారు. ఈ ప్రశ్నకు ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమాధానం ఇస్తూ, కేంద్ర బడ్జెట్ 2025లో 'అణుశక్తి కార్యక్రమం' ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద, చిన్న అణు రియాక్టర్ల పరిశోధన, అభివృద్ధి కోసం రూ.20 వేల కోట్లు కేటాయించారని చెప్పారు. ఈ రియాక్టర్లు పర్యావరణ అనుకూల ఇంధన వనరుల కోసం దేశం యొక్క ప్రయత్నాలకు ఊతమిస్తాయని పేర్కొన్నారు. భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ స్మాల్ మాడ్యులార్ రియాక్టర్ల అభివృద్ధి బాధ్యతలను చేపట్టిందని తెలిపారు. ప్రస్తుతం, ఇక్కడ ప్రస్తుతం మూడు రకాల స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లను అభివృద్ధి చేస్తున్నారని తెలియజేసారు. పాత థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ల స్థానంలో, అధిక విద్యుత్ వినియోగ పరిశ్రమలకు విద్యుత్ అందించడానికి భారత్ స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు (బిఎంఎస్ఆర్-200), మారుమూల ప్రాంతాలకు, గ్రిడ్ సౌకర్యం లేని ప్రదేశాలకు విద్యుత్ అందించడానికి స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్-55), రవాణా, పరిశ్రమల రంగాల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి అవసరమైన హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయడానికి 5 మెగావాట్ థర్మల్ సామర్థ్యం గల హై టెంపరేచర్ గ్యాస్ కూల్డ్ రియాక్టర్లను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రియాక్టర్ల తొలి యూనిట్లను అణుశక్తి విభాగం స్థలాల్లో, ఆ తర్వాత పాత విద్యుత్ కేంద్రాల వద్ద లేదా పరిశ్రమల దగ్గర నిర్మిస్తారని మంత్రి తెలిపారు. విశాఖపట్నంలో బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ ఒక కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందని తెలియజేసారు.

## తిరుపతిలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

**- ఈనెల 24, 25, 26వ తేదీలలో...**
**- హాజరుకానున్న రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి**
**- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**




**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:**
తిరుపతిలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా అమరావతి ఛాంపియన్‌షిప్-2025 పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని తెలియజేశారు. జిల్లా స్థాయి, జోనల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు చేరుకున్నారని వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో 2వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడాశాఖామంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడాశాఖ ఉన్నతాధికారులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీన విశాఖపట్టణంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిధిగా విచ్చేస్తారని, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఎం చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

## భరతమాత ముద్దుబిడ్డ రాజీవ్ గాంధీ

**- తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడ పేరు చిట్టిబాబు**



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు దేశాభివృద్ధికి పునాదులు వేసిన గొప్ప నాయకుడు భరతమాత ముద్దుబిడ్డ రాజీవ్ గాంధీ అని కొనియాడారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ తీసుకున్న మొదటి చర్య జనవరి 1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, బీసీ సెల్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బైలు గోపి గౌడ్, ఎస్టి విభాగం జిల్లా అధ్యక్షుడు జ్యోతిశ్వర్ నాయక్, మైనారిటీ విభాగం తిరుపతి నగర అధ్యక్షుడు సలీముల్లా, ఎస్సీ విభాగం రాష్ట్ర మాజీ కన్వీనర్ బోయన నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## మేరుగను పరామర్శించిన సన్నారెడ్డి, పుట్టబాబు



**చిట్టమూరు మేజర్‌న్యూస్:** స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్ఆర్సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగ మురళీధర్‌ను వైఎస్ఆర్సీపీ చిట్టమూరు మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి,ఈశ్వరవాక సచివాలయ మాజీ కన్వీనర్ వై చెంచు పుట్టబాబులు బుధవారం పరామర్శించారు.మురళీధర్ తండ్రి ఆనందరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు.ఆమేరకు రాపూరులో ఎమ్మెల్సీ మురళీధర్ నివాసంలో ఆయనను కలుసుకుని పరామర్శించారు. మృతుడు ఆనందరావు ఆత్మకు శాంతి చేకూరాలని, దేవుడు కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## కూటమి ప్రభుత్వానికి తాము ఎప్పుడు రుణపడి ఉంటాం

**- అప్పిరెడ్డి కండిగ మహిళలు**
**- చంద్రబాబు పాలన శ్రీరాముని పాలన తలపిస్తుంది**
**- జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్**



**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** కూటమి పాలన శ్రీరాముని పాలన ఉందని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. మంగళవారం గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లి పంచాయతీ అప్పిరెడ్డి కండ్రిగ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లో తమకు మంచి జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు తమకు అన్ని అందాయని అన్నారు. తామంతా కూటమీ ప్రభుత్వానికి ఎప్పుడు రుణపడి ఉంటామని మహిళలు తెలిపారు. అనంతరం జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన శ్రీరాముని తలపిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ కృషితో పరిశ్రమల హబ్బుగా అవుతోందని హర్షం వ్యక్తం చేశారు.

## నెలబల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** రైతుల సమస్యలను తీర్చేందుకే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమంను మండలంలోని నెలబల్లి, చెంబేడు, పునబాక పంచాయతీలలో మండల వ్యవ సాయ శాఖ అధికారి సి.హెచ్ విజయ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అసిస్టెంట్ అగ్రికల్చరల్ డైరెక్టర్ నాగార్జున సాగర్ మాట్లాడుతూ మండలంలోని రైతులందరు కోత దశలో ఉన్న వరిని వర్షాల రాక మునుపు వరి కోతలను ప్రారంభించాలని కోరారు. గత మూడు రోజుల నుండి కురిసిన వర్షాలకు నెలకొరిగిన వరిపై రైతులు ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే స్థానికంగా సచివాలయంలో ఉన్న విఏఏలను సంప్రదించాలన్నారు.

# యువతకు ఉద్యోగ అవకాశ కల్పనే లక్ష్యం :ఎమ్మెల్యే



**పూతలపట్టు, మేజర్‌న్యూస్:** పూతలపట్టు నియోజకవర్గంలో ఉద్యోగ మేళాతో యువతకు ఉపాధి అవకాశాలు అందనున్నాయని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రారంభించారు. బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పేటమిట్ట అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మురళీ మోహన్‌ని స్థానిక నాయకులు, అమరరాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు దుశ్శాలువలు, పూలమాలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాబ్ మేళాలో పాల్గొనే కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడి విద్య, నైపుణ్యం తగినట్టు ఉద్యోగం కల్పించాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఈ జాబ్ మేళలో ఎంపికైన యువతే యువకులకు అపాయింట్మెంట్ ఆర్డర్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి వివిధ కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తూనే మరో వైపు జాబ్ మేళాలను నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని చదువుకున్న యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జాబ్ మేళాలో ఉద్యోగం పొందని నిరుద్యోగులకు కోసం త్వరలోనే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణకల్పించి జాబ్ మేళాను నిర్వహిస్తామన్నారు. ఈజాబ్ మేళాకు ఆగస్టు 10, 2025న ముందస్తు స్క్రీనింగ్ రిజిస్ట్రేషన్ పూర్తయిందని, ఆగస్టు 12నన ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని, ఈజాబ్‌మేళాలో 25కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి 1,250కి పైగా ఖాళీలు వివిధ అర్హతలతో ఉన్న అభ్యర్థుల కోసం అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ పీజీ చదివిన వారు అర్హులని, ఉద్యోగం పొందిన వారికి 13,000 నుండి 41,000 వరకువేతనం ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి గుణ భూషణ రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారుపాలెం మండల అధ్యక్షులు ఎన్‌పి ధరణినాయుడు, తవణంపల్లి మండలం అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాలెం మార్కెట్ డైరెక్టర్ గురుస్వామి, పేటమిట్ట గ్రామ సర్పంచ్ గల్లా రాధాకృష్ణ నాయుడు, అమర్ రాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

# రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో కావలి వన్‌టౌన్, టూటౌన్, కావలి రూరల్ సీఐ, ఎస్ఐల సహకారంతో కె.బిట్రగుంట ఫారెస్ట్ బీటు పరిధిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో రెండుకార్లు, ఒక లారీ వేగంగా రాసాగాయి. తనిఖీలను గమనించిన రెండు కార్లు యూ టర్న్ తీసుకుని వెళ్లగా, లారీ టాస్క్ ఫోర్స్ సిబ్బందిపైకి దూసుకుని వచ్చింది. అప్రమత్తమైన సిబ్బంది పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకుని, సాహసోపేతంగా లారీని వెంబడించి ఆపగలిగారు. అంతలోనే లారీలో ఉన్న వ్యక్తులు కిందకు దూకి పారిపోసాగారు. అయితే ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతనిని హర్యానాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. లారీలో 83 ఎర్రచందనం దుంగలు లభించాయి. వీటి విలువ రూ. రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన వ్యక్తిని, దుంగలు, లారీని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. డిఎస్పీ వి.శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్‌లు నిందితుని విచారించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# 267 మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశాం

## కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 267మందికి టిడిఆర్ బాండ్లను పంపిణీ చేశామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్లైన్ చేశామన్నారు. పలు మార్లు టిడిఆర్ కమిటీ సభ్యులు ఆన్లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామని అన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 267 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. కాగా బుధవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు అన్ని పత్రాలను పరిశీలించి ఎంపిక చేశామన్నారు. వీరందరూ గిఫ్ట్‌డీడ్ ఇచ్చిన వెంటనే టిడిఆర్ బాండ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిసిపి ఖాన్, ఏసిపిలు మూర్తి, మధు, టిపిఓ వంశీ, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# మహేష్ కుటుంబానికి సిపాయి భరోసా పంపిణీ

**ఏర్పేడు, మేజర్‌న్యూస్:** మండలంలోని ఎండి పుత్తూరు గ్రామం మిట్ట ఇండ్లులో మృతి చెందిన మహేష్‌కి డాక్టర్ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం వీరమరణ వార్త విన్న మరుక్షణం ఆ కుటుంబాన్ని అంతో ఇంతో ఆదుకోవాలని దృఢ సంకల్పంతో తనవంతు సహాయం సిపాయి భరోసా 60 నిత్యవసర వస్తువులు ఆ కుటుంబానికి సహాయంగా అందించడం జరిగింది. ఆ కుటుంబానికి ఎల్లవేళల నేనున్నానని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎండి పుత్తూరు గ్రామసర్పంచ్ మోహన ప్రియ, మండల వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు



మునికృష్ణారెడ్డి, ఎక్స్ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, బాలాజీరెడ్డి, ఎండి పుత్తూరు మునిశేఖర్‌రెడ్డి, జిపి. యాదవ్ సరస్వతి సరస్వతి కండ్రిగ వినోద్, వెంకటేష్, జ్ఞానశేఖర్, రమేష్ ఈశ్వరయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డిజిటల్ నర్వ్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. రాష్ట్రంలో తొలిసారిగా కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ పనితీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతికత వినియోగించడంతో వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవచ్చన్నారు. తద్వారా ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా కుప్పం నియోజకవర్గ పరిధిలోని 13 పీహెచ్‌సిలు, 92 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేయడం జరిగిందని





తెలిపారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఈ కేంద్రం సేవలందించ నుందని రోగుల కన్సల్టెన్సీ సేవలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. డిజిటల్ నర్వ్ సెంటర్ నందు జిల్లా కలెక్టర్ హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని, డాక్టర్లు ఏ సమయానికి వస్తున్నారు, ఎప్పుడు వెళ్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు అందుబాటులో ఉండి సెలవు రోజుల్లో కూడా హాజరు కావాలని, సెలవు రోజు హాజరైన డాక్టర్‌కి ప్రత్యాయంగా ఇంకో రోజు సెలవు తీసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ నర్వ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన విద్యా విధానంతో దేశాభివృద్ధి : వీసీ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో సత్వర దేశాభివృద్ధి సాధ్యమని ఎస్వీయూ వీసీ అప్పారావు అన్నారు. ఏబీఆర్ఎస్ఎం, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఐపీ-2020 విధానాన్ని ప్రవేశపెట్టి 5 సంవత్సరాలు పూరైన సందర్భంగా 'ఎన్ఈపి- 2020 ఎట్ ది రేట్ ఫైవ్ ఇయర్స్, పాలసీ, ప్రాక్టీస్, అండ్ ప్రోగ్రెస్' అనే అంశంపై సదస్సును బుధవారం సెనేట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ నూతన విద్యావిధానాన్ని కేంద్ర 2020లో ప్రారంభించిందని, గత ఐదేళ్లుగా కేజీ టూ పీజీ వరకు ఎన్ఏపీని అమలు పరుస్తున్నారని తెలిపారు. అనంతర ముఖ్యవక్తగా విచ్చేసిన ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటనా కార్యదర్శి గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని, కానీ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య దాకా అంతా మాతృభాషలోనే జరుగుతుందన్నారు. కావున భారతదేశంలో విద్యార్థి అభిరుచికి అనుగుణంగా మాతృభాషలోనే విద్యను బోధించే అవకాశాన్ని నూతన జాతీయ విద్యా విధానం కల్పిస్తుందని తెలియజేశారు. విశ్వవిద్యాలయాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు కోసం బడ్జెట్లో కేటాయిస్తున్న జీడీపీ కనీసం 6శాతం పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా



లకు విజ్ఞప్తి చేశారు. బోధన, బోధనేతర ఖాళీలు అన్నింటిని పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు వైవీ రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ వాణి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ రంజని, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్య హైదరాబాద్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమిషయన్స్, పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, 300మంది విద్యావేత్తలు పాల్గొన్నారు.

## చంద్రగిరి అభివృద్ధికి మరో ముందడుగు వేసిన ఎమ్మెల్యే పులివర్తి



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి అభివృద్ధికి ఎంఎల్‌ఏ నాని మరో ముందడుగు వేశారు. బుధవారం చంద్రగిరిలో నాని విస్తృతంగా పర్యటించారు. చంద్రగిరి పట్టణంలో అధికారులతో కలిసి బీసీ, ఎస్సీ హాస్టల్‌కు స్థలం పరిశీలించారు. బాలికల హాస్టల్ వద్ద శుభ్రత లేక పోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. హాస్టల్లో శుభ్రత లేకపోతే విద్యార్థులు అంటు వ్యాధుల వలన ఇబ్బంది పడతారని తక్షణమే శుభ్రత చేయించి బ్లీచింగ్ వేయాలని హాస్టల్ వార్డెన్లు ఆదేశించారు. చంద్రగిరి పట్టణంలో ఆక్రమనకు గురైన స్థలాలను, కాలవలను గుర్తించాలని మండల రెవిన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. చంద్రగిరి బాలుర పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు తెలిపారు. చంద్రగిరి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో అసంపూర్తిగా నిలిచిన తహసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి అసంపూర్తిగా ఉన్న తహసిల్దార్ కార్యాలయం పనులను త్వరగా పూర్తి చేయాలని మండల స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులకు తెలిపారు. అనంతరం చంద్రగిరి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో లబ్ధిదారులకు ఇచ్చిన అర్జీలను ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలను త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. చంద్రగిరి మండలంలో సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని కోరిన ఎమ్మెల్యే. కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో భద్రతా చర్యలపై క్షేత్రస్థాయిలో చర్చించడం జరిగిందన్నారు. మాడ వీధుల్లో అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్యం కోసం అదనపు సిబ్బంది నియమించనున్నట్లు తెలిపారు. గ్యాలరీల్లో ఉన్న ప్రతి భక్తుడికి అన్న ప్రసాదాలు అందేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది గరుడవాహన సేవకు 3 లక్షలకు పైగా భక్తులు విచ్చేశారని, అందుకనుగుణంగా ఈ ఏడాది అదనపు ట్రిప్పులు తిప్పేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. తిరుమలలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తుగా పార్కింగ్ ప్రణాళికలు రూపొందించి తిరుపతిలో కూడా పార్కింగ్ లు ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు వచ్చేలా చర్యలు చేపట్టామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓ లోకనాథం, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఉదయం కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. నగరంలోని నిమ్మకాయలవీధి, మిట్టవీధి, రాములవారి గుడివీధి, కాళికమ్మ గుడి తగితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, శైలజ, అధికారులతో కలసి పరిశీలించారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా ఉండడంతో నీరు అక్కడే ఆగిపోయి అపరిశుభ్రత అవుతోందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని కాలువలు శుభ్రం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా తొలగించాలన్నారు. ప్రజలు కూడా తమనవంతు సహకారం అందిస్తే నగరం శుభ్రంగా ఉంటుందని అన్నారు.




కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మధు, డీఈలు రాజు, శిల్ప, సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.

## ముక్కంటి సేవలో కేంద్ర అదనపు కార్యదర్శి

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ఆదనపు కార్యదర్శి మరియు ఫుడ్ సప్లై



మరియు కన్స్యూమర్ అఫైర్స్ కమిషనర్ సంజీవ్ కుమార్ బుధవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ మండపంలో వేద పండితుల ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

## సింగల్‌విండో చైర్‌పర్సన్‌గా కృష్ణమనేని సావిత్రి బాధ్యతల స్వీకరణ

**పాకాల, మేజర్‌న్యూస్:** పాకాల సింగల్ విండో చైర్‌పర్సన్‌గా కృష్ణమనేని సావిత్రి బుధవారం అధికారికంగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని అలాగే సింగల్ విండో సహారా బ్యాంకును అభివృద్ధి బాటలోకి తీసుకొస్తానన్నారు. తనకు పదవి వచ్చిన సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో సహకార బ్యాంకు సిబ్బంది మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## జిల్లా క్రీడాకారులు ఇండియాకు ఆడాలన్నదే లక్ష్యం

**ఏసిఏ జాయింట్ సెక్రటరీగా ఎన్నిక కావడం ఆనందంగా ఉంది**
**రాష్ట్రంలో క్రికెట్ ను అన్ని విధాల అభివృద్ధి చేస్తాం**
**క్రికెటర్లకు బ్యాటింగ్, బౌలింగ్ తో పాటు ఫిట్ నెస్ ఎంతో ముఖ్యం**
**జిల్లా నుంచి 11 మంది ఏపీఎల్ కు ఆడటం గర్వంగా ఉంది**
**క్రికెట్ పై తల్లిదండ్రులకు అవగాహన అవసరం**
**రాష్ట్ర జాయింట్ సెక్రటరీ క్రికెట్ విజయ్ కుమార్**

**తిరుపతి,క్రైమ్, మేజర్‌న్యూస్:** ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు ఇండియాకు ఆడాలన్నదే లక్ష్యమని, అందుకు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అన్ని విధాల తమ సహాయ సహకారాలు అందిస్తుందని సిడిసిఏ జిల్లా అధ్యక్షులు, ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఏసీఏ ఎన్నికలలో గత 72 సంవత్సరాల చరిత్రలో మొట్టమొదటిసారిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి క్రికెట్ విజయ్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం పాయ్ వైస్రాయ్ హెూటల్లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతోగొప్ప ఆట అయిన క్రికెట్‌ను నా మూడో తరగతి నుంచి ఎంతో ఇష్టంగా క్రికెట్‌ను ప్రారంభించాన న్నారు. అప్పటిలో అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ పలు ఫార్మాట్లలో ఉన్నత స్థాయి క్రికెట్‌ను ఆడడమే కాక, లెవెల్ వన్ బిసిసిఐ కోచ్‌గా కూడా వ్యవహరించానని తెలిపారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైనప్పటి నుంచి ప్రతిభ గల క్రీడాకారులకు ఉన్నతమైన ఆటను కల్పించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే అండర్ 12, 14, 16, 19, 23, సీనియర్స్ పురుషులు, మహిళ జట్లకు ఎక్కువ మ్యాచులు నిర్వహించి వారి ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అందుకు ఫలితంగానే ఈ సంవత్సరం అన్ని ఫార్మేట్‌లలో ఉమెన్స్, పురుషుల జట్లు ఛాంపియన్స్‌గా నిలవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఏసిఏ జాయింట్ సెక్రటరీగా ఎన్నుకోవడం పట్ల ఆయన మాట్లాడుతూ ఈ పదవి నాపై బాధ్యత మరింత పెంచిందని, రాష్ట్రంలో క్రికెట్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. ఏసీఏ అధ్యక్షులు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్‌బాబు, కోశాధికారి దండమూరి శ్రీనివాస్, కౌన్సిలర్ విష్ణుదంతు సహకారంతో రాష్ట్రంలోని క్రికెట్ క్రీడాకారులకు ఉన్నత భవిష్యత్తును అందిస్తామన్నారు. అందుకు అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏసిఏ ఆధ్వర్యంలో క్రీడామైదానాల ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో అన్ని ఫార్మేట్‌లలో లీగ్ మ్యాచ్లు నిర్వహించి క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు.



ప్రతి క్రికెటర్‌కు బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫిట్నెస్ ఎంతో ముఖ్యమని, ఫిట్నెస్ లేనివారు జట్టులో చోటు కోల్పోతారని హెచ్చరించారు. అప్పుడే పిల్లల భవిష్యత్తు మరింత గొప్పగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ కార్యదర్శి రవి,కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు మురళి యాదవ్, కోలా హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్య శ్రీనివాస్, గాలి వేణుగోపాల్ నాయుడు, శివప్రసాద్, రమణ, ప్రకాష్, కోచ్‌లు సునీల్, చిన్నబాబు, అనిత, చంద్రిక, సీనియర్ క్రికెటర్ అంపైర్ సుదర్శన్, చిత్తూరు సీనియర్ క్రికెటర్ జాకీర్, అండర్ 23 సీనియర్స్ ఉమెన్స్ జట్టు, అండర్ 16బాయ్స్ జట్టు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి "జంప్ రోప్" పోటీలలో..మంగళం విద్యార్థుల ప్రతిభ



**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** నెల్లూరు జిల్లా, కావలి పట్టణంలో ఈనెల 16, 17 తేదీల లో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ "జంప్ రోప్" పోటీలలో మంగళం (టైండ్స్) ఉన్నత పాఠశాల క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి 5 బంగారు పతకాలు, 5 వెండి పతకాలు, 3 కాంస్య పతకాలు సాధించారు.వీరిలో కోకిల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఒక బంగారు పతకం, ఒక వెండి పతకం, ఒక కాంస్య పతకం సాధించి వ్యక్తిగత ఛాంపియన్ గా నిలిచినది. అలాగే తిరుపతి జిల్లా క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్ కూడా సాధించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే సెప్టెంబర్ నెలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ లో జరగబోయే జాతీయస్థాయి "జంప్ రోప్" ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు సి.కేశవ నాయుడు, పీడీలు సాంబశివరావు, సురేష్, రూపలత తెలియజేశారు.విజయం సాధించిన క్రీడాకారులను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు రాజశేఖర్,మురళి, సుభాష్ చంద్ర దాస్,రమణయ్య, కుమార్,గోపీనాథ్,విశ్వనాథ శెట్టి వసుంధర,వరలక్ష్మి,ప్రార్థన సమావేశంలో అభినందించి జాతీయస్థాయిలో విజయం సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు.

## ఆకాష్‌లో ఆంథే స్కాలర్‌షిప్ పరీక్ష



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆంథే-2025 పేరుతో విద్యార్థులకు స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు స్టేట్ అకడమిక్ ఆపరేషన్ హెడ్ ఆర్విఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఆకాష్ సంస్థలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రీజనల్ సేల్స్ హెడ్ నిశాంత్ మిత్రా, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ కుమార్, రీజినల్ మార్కెటింగ్ హెడ్ నరసింహులు, బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యంతో కలిసి ఆంథే స్కాలర్ షిప్ సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు, మెరిట్ విద్యార్థులు తమ టాలెంట్ ను నిరూపించుకుని కోట్లలో స్కాలర్ షిప్ లు పొందుతూ సంస్థలో ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత కోచింగ్ పొందేందుకు సంస్థ అవకాశం కల్పించిందన్నారు. ఆన్లైన్లో అక్టోబర్ 4 వతేదీ నుంచి 12 వరకు, ఆఫ్లైన్ ద్వారా అక్టోబర్ 5వ, 12వ తేదీలలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు కేవలం రూ.150 రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి విద్యార్థికి రూ.5వేల విలువగల ఆన్లైన్ స్టడీమెటీరియల్ అందించబడుతుందని తెలిపారు.

## నాణ్యమైన శిక్షణ నైపుణ్యాల బలోపేతానికి కృషి

**- డిప్యూటీ డైరెక్టర్ జనరల్**



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎన్సీసీ క్యాడెట్లకు నాణ్యమైన శిక్షణ, నైపుణ్యాల బలోపేతం, సాహస కార్యక్రమాలు, కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రాజెక్టో పాల్గొనేలా కృషి చేయాలని ఎన్సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం తిరుపతిలోని ఎన్సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్సీసీ క్యాడెట్లు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. గౌరవ వందనం అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి ప్రధానాంశాలుగా భాధ్యాతాయుతమైన పౌరులను దేశానికి అందించుటలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. తిరుపతి గ్రూప్ క్యాడెట్లు జాతీయ శిబిరాలలో, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దాహియా, ఎన్సీసీ అధికారులు పాల్గొన్నారు.

## ట్రైనీ ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న చందన ప్రియ



**పుంగనూరు, మేజర్ న్యూస్:** చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో పిఎస్ఐగా పనిచేస్తున్న చందన ప్రియ బుధవారం పుంగనూరు పోలీస్ స్టేషన్ నందు ట్రైనీ ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు.

## వి.కోటలో చైన్ స్నాచింగ్

**వి.కోట, మేజర్ న్యూస్:** మహిళ మెడలోని బంగారపు గొలుసును దుండగులు దొంగిలించిన ఘటన బుధవారం వి.కోట పట్టణంలో జరిగింది. మండల పరిధిలోని ఎగువ మసీదు వీధిలో బుధవారం తెల్లవారుజామున అంగన్వాడి టీచర్ అమరావతి మెడలో మూడు తులాల బంగారు గొలుసు గుర్తుతెలియని దుండగులు బైక్ పై వచ్చి మెడలోని అపహరించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు.

## డిష్ రమేష్‌కు సన్మానం



**పలమనేరు మేజర్‌న్యూస్:** పట్టణంలోని పిజెసి కళ్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం బలిజ అభ్యుదయ సేవా సంఘం సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో కళ్యాణ మండపంను త్వరగా పూర్తి చేయాలని సంఘం సభ్యులు నిర్ణయించారు. అనంతరం సింగల్ విండో డైరెక్టర్ గా నియమితులైన డిష్ రమేష్ ను బలిజ సంఘం సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సుధాకర్, అధ్యక్షులు రూపేష్, దైవ ప్రసాద్, పి జె సి బాబు, కిరణ్, కె.ఆర్ జయశంకర్, చెంచు రెడ్డి, జిల్లేడు అరుణ్, సుబ్బ నాగయ్య, శ్రీధర్, రవి, డాక్టర్ జనార్దన్, నరేష్, మంజు, ముని రాజా, కోటి,గణేష్, వెంకటరమణ, లక్ష్మీపతి, సుదర్శన్, ఆర్టీసీ సుబ్రహ్మణ్యం, పుష్పాల వెంకటేశ్వర్లు, కిషోర్, గోవర్ధన్, చంద్రన్న, రమేష్, శ్యామ్, జన, శివకుమార్, సుత్రి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# దోమల నియంత్రణతోనే వ్యాధులు దూరం

**- ఇన్చార్జ్ డీఎంహెచ్వో డా.వెంకట ప్రసాద్**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** దోమలను నియంత్రించడం, దోమల కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులు రాకుండా కట్టడి చేయవచ్చని జిల్లా ఇన్చార్జ్ డీఎంహెచ్వో డా.వెంకట ప్రసాద్ చెప్పారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్చార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్వో డా.పి.లోకేష్ లతో కలిసి చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 8వ వార్డు వెంగళరావు కాలనీలో అవగాహన ర్యాలీ, దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద కర విష జ్వరాలు చాలా వరకు దోమ కాటు వలనే వ్యాపిస్తాయన్నారు, పరిసరాలలో శుభ్రం గా ఉంచుకోవడం, నిల్వ నీరు లేకుండా చూడ డం వల్ల దోమలను నియంత్రించవచ్చన్నారు. దోమలు కొట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకో వాలని పిలుపునిచ్చారు. దోమల నియంత్రణకు నగరపాలక సంస్థ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్చార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి చెప్పారు. ఎంహెచ్వో డా.పి.లోకేష్ మాట్లాడుతూ నగర పాలక పరిధిలో దోమల నియంత్రణకు ఫాగింగ్, మలాథియాన్ స్ప్రేయింగ్, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మేజర్ కాలువలో ఆయిల్ బాల్స్ వేసి, స్ప్రేయింగ్ చేయించారు. దోమల నియంత్రణపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంఓ వేణుగోపాల్, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.







## ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదమే వాకర్స్ అసోసియేషన్ లక్ష్యం

**-ఆర్కాట్ కృష్ణ ప్రసాద్**

**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్ :** ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదమే వాకర్స్ అసోసియేషన్ లక్ష్యమని వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ అన్నారు.బుధవారం స్థానిక సరోజినీ దేవి రోడ్ లోని వాకర్స్ అసోసియేషన్ రీజినల్ కార్యాలయం నందు ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి సహకారంతో నగరంలోని అన్ని వాకర్స్ అసోసియేషన్ లకు రెండు లక్షల రూపాయల విలువైన 100 బిపి సూచించే యంత్రాలను ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తమ అసోసియేషన్ పనిచేస్తుందని తెలిపారు. ఈ క్రమంలోనే నగరంలోని 15 వాకర్స్ అసోసియేషన్లకు 100 బిపి మిషన్లను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి ప్రతినిధులు డాక్టర్ శ్రీధర్, ముని,ఆనంద్ లకు కృతజ్ఞలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శంకర్ నాయుడు,శివ గణేష్,శివారెడ్డి, అనసూయమ్మ, సీతమ్మ, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి సన్నిధిలో అర్ధరాత్రి చోరీ కలకలం



**కెవిబిపురం మేజర్‌న్యూస్:** మండలంలోని కాట్రపల్లి గ్రామపంచా యతీ కాట్రపల్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో, నాగాలమ్మ ఆలయంలో ఆలయ ఉండిని గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి ఒంటి గంటల ప్రాంతంలో ఆలయంలోని గేట్లను వేసిన భేగాలను కొట్టుకొని గర్భగుడిలోని స్వామి అమ్మ వార్ల నగలను ఆలయంలో ఉండిని తీసుకుని దక్షిణ బాగానా ప్రహరీ గోడ దాటి వెళ్లినట్లు అక్కడ స్థానికులు తెలిపారు. పురాతన విగ్రహాలుగా ఉన్న శ్రీదేవి భూదేవి వైకుంఠ నాథ స్వామి విగ్రహాలకు ఇప్పుడు ప్రస్తుత బీజేపీ రాష్ట్ర నాయకులు కోలా ఆనంద్ అదేవిధంగా వైయస్సార్పీ మండల అధ్యక్షులు గవర్ల కృష్ణయ్య గ్రామస్తులు అందరి సహకారంతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టి పీఠాధిపతుల ద్వారా ఎంతో అత్యంత వైభవంగా ఆలయంలో పూజలు నిర్వహించే ది నిత్యం ఒక పూజారిని కూడా అక్కడ ఏర్పాటు చేసి ధూప దీప నైవేద్యాలతో అమ్మవారికి పూజలు జరిగేవి. ఆలయం పట్టపగలు లాగా దీపాలతో రాత్రివేళ యందు కూడా విద్యుత్తు దీపాలు వెలుగుతూ ఉంటాయి. గుడిలోని హుండీ తీసుకెళ్లి బయట ప్రాంతంలో పగలగొట్టి అందులో నాణేలను మాత్రం తీసుకోకుండా నోట్ల కట్టలేదన్న ఉంటే నోట్లోకి మాత్రం తీసుకుని పక్కనే ఓ ఈసీ పుటేజ్ చూస్తే రాత్రి ఒంటి గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఉండిని తీసుకెళ్తా ఉన్నట్లు సిసి పుటేజ్ లో ఉంది. దీనిపైన రాష్ట్ర నాయకులు కోలా ఆనంద విషయాన్ని ఎస్పీ స్థాయిలో తెలియజేయ చేశారు. ఈ ఘటనకు పాల్పడిన వారి వివరాలను ఇంకా తెలియ రాలేదు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మురళీమోహన్



**పూతలపట్టు, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ ఏపీ.ఎస్. ఎస్.డీ.సీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన పూతల పట్టు మండలం, పేట మిట్ట గ్రామంలోని అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు నిర్వహిం చనున్న జాబ్ మేళా పోస్టర్‌ను పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ గురువారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో గల పూతలపట్టు శాసనసభ్యులు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇందులో సుమారుగా 25 కంపెనీలు పాల్గొని సుమారుగా 1200 మందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్‌మేళాలో పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ చేసిన నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. అదేవిధంగా 20వ తారీఖు ఉదయం 9 గంటల నుండి తలుపులపల్లె, రంగంపేట క్రాస్ వద్ద ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని, తదుపరి వివరాలకు నాగరత్నం : 8520048041, లోకేష్ : 9963561755 సంప్రదించాలని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు పాళ్యం మండల అధ్యక్షులు ఎన్.పి.ధరణి నాయుడు, యాదమరి మండలం అధ్యక్షులు మురార్జీ యాదవ్, యాదమరి మండలం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ, యాదమరి మండల నాయకులు విజయేంద్ర యాదవ్, పూతలపట్టు మండల మాజీ అధ్యక్షులు చంద్రమౌళి, డిఎస్డివో ఎం.గుణశేఖర్ రెడ్డి, శిశిధ్రి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**ఓజిలి, మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు వెంకటాచలం మండలం కసుమూరు గ్రామానికి చెందిన బద్దిగా మస్తానయ్య నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వెళుతున్న క్రమంలో ఆటో డీకొరింది ఈ ప్రమాదంలో మస్తానయ్య తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. గద్దం చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ బెల్లంకొండ అంకయ్యపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



**తడ, మేజర్‌న్యూస్:** మండలంలో ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తడ ఎస్సై కె కొండప్ప నాయుడు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి నిర్వహకు వినాయక చవితి ఉత్సవాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీస్ విద్యుత్ పంచాయతీ అధికారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు రాత్రి వేళల్లో విగ్రహాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలని సూచించారు నిబంధనలకు విరుద్ధంగా పాటించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. వీరితోపాటు ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ లు, కానిస్టేబుల్ లు ఉన్నారు.

## పాడి రైతులకు అండగా ప్రభుత్వం: ఆర్టీసీ వైస్ ఛైర్మన్



కుప్పం, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వం పాడి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం మండలం కంగుంది రైతు సేవా కేంద్రంలో బుధవారం పాడి రైతులకు సబ్సిడీపై మొక్కజొన్నను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పాడి రైతులకు తక్కువ ధరలో పశువుల ఆహారం లభించి, వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా పాడి పరిశ్రమ అభివృద్ధికి కూడా దోహద పడుతుందని పి.ఎస్. మునిరత్నం పేర్కొన్నారు.కుప్పం ప్రాంతంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని, చంద్రబాబు కృషితోనే కుప్పంలో పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి దివాకర్, మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సంఘ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తుల అరెస్టు



ఏర్పేడు మేజర్‌న్యూస్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ ఆదేశాలతో రేణిగుంట సబ్ డివిజన్ ఏర్పేడు మండలంలో డ్రోన్ కెమెరాలతో బీట్ నిర్వహించడం జరిగింది. ఏర్పేడు మండలం పరిధిలో మెర్లపాక, బండారు పల్లె, ముసలిపెడు, కందాడు, రామలింగాపురం నిర్వహించారు. ముసలిపెడు గ్రామ పొలాలలో గుంపుగా కూర్చుని పేకాట ఆడుతున్నట్లు డ్రోన్ కెమెరా గుర్తించడం జరిగింది.ఈ నేపథ్యంలో స్థానిక ఏర్పేడు పోలీసు వారు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ డ్రోన్ కెమెరాలా ఇంచార్జి వినోద్ కుమార్ గారి పర్యవేక్షణలో 10 మంది పోలీసు సిబ్బంది పేకాటశిబిరం పైదాడి చేశారు. పేకాట ఆడుతున్న ప్రాంతలకు వెళ్ళుతున్న సమయంలో మూడు ప్రదేశాలలో పేకాట నిర్వాహికులకు ఇన్ ఫార్మర్స్ ఉన్నట్లు గుర్తించి తొలుత వారిని అదుపులో తీసుకోవడం జరిగినది. అక్కడ నుండి పోలాలలోకి వెళ్ళుతున్న పోలీసు వారిని చూసి పేకాట అడుతున్నవారు పరుగుపెట్టారు. పోలీసు సిబ్బంది చాకచక్యంగా పేకాట అడుతూ.. పరుగు పెట్టిన వారిని 11 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. వారి నుండి 2,36,740 రూపాయలు నగదు, 12 సెల్ ఫోన్స్, నాలుగు బైక్స్, సీజ్ చేయడం జరిగింది.పేకాట పడుతున్న వారు తిరుపతికు చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన ఐదుగురు, అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ఇద్దరు, కోదూరుకు చెందిన ఒకరు, కలకడకు చెందిన ఒకరుగా గుర్తించారు. వారని ఏర్పేడు పోలీసు స్టేషను కు తరలించి కేసు నమోదు చేయగా మిగిలిన తొమ్మిది మంది కోసం గాలిస్తున్నారు. తిరుపతి జిల్లాలో పేకాట ఎక్కడ నిర్వహించిన , పేకాట అడిన అలాంటి వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## వైభవంగా మాతమ్మ అమ్మవారి జాతర



పెనుమూరు మేజర్‌న్యూస్: గ్రామదేవత అయిన మాతమ్మ అమ్మవారి అమ్మవారి జాతరను జాతరను అత్యంత వైభవంగా పెనుమూరు పంచాయతీ పాపిరెడ్డి పల్లి ఆది అందరివాడ గ్రామస్తులు ఘనంగా చేపట్టారు. బుధవారం అమ్మవారికి జాతర నిర్వహణలో ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక అర్చనలు అభిషేకాలను ఘనంగా చేపట్టారు. అదే విధంగా పలువురు అమ్మవారి పేరిట ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. మరికొంత మంది అమ్మవారి భక్తులు అమ్మవారికి పొంగళ్లను నిర్వహించి తమ ముక్కులను చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా చేపట్టారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి పల్లె గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దోమలను సమూలంగా నిర్మూలించాలి



వెదురుకుప్పం, మేజర్‌న్యూస్: దోమలను సమూలంగా నిర్మూలించాలని పచ్చికాపలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. బుధవారం వెదురుకుప్పం మండలం ఆర్కే పురంలో ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడుతూ దోమల నివారణకు గృహాల చుట్టూ ప్రక్కల ప్రదేశాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. ట్యాంకులు, నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉంచరాదు అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ లాంటి వ్యాధులు దోమల కారణంగా వ్యాపిస్తాయని, వీటి నివారణకు దోమతెరలను, పరిసరాల శుభ్రతను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మధుసూదన్, ఎం పి హెచ్ ఎ పట్టుబాల కృష్ణారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి అందరూ సహకరించాలి



సూళ్లూరుపేట రూరల్, మేజర్‌న్యూస్: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండల ప్రజా పరిషత్ అధికారి మురళి క్రిష్ణ పర్యవేక్షణలో బుధవారం యం.డి. ఓ. కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి ముఖ్య అతిధులుగా మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట మండల పరిధిలో ఉన్న 19 పంచాయితీలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతి నిధులు,పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో త్రాగు నీటి కొరత, లేకుండ చూసుకోవాలని అన్నారు. అంతే కాకుండ ఇల్లు లేని ప్రతి పెద వాడికి పక్కా గృహం మంజూరు చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో సూళ్లూరుపేట తహసిల్దార్ పెల్లూరు గోపి నాథ్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, సర్పంచ్ లు, యంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# పెరోల్ విషయంలో నీచ రాజకీయాలు - నా ప్రమేయం లేదు

### - ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



గూడూరు, మేజర్‌న్యూస్: జీవిత ఖైదీలకు ఇచ్చే పెరోల్ విషయంలోనూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ విమర్శించారు. బుధవారం సాయంత్రం గూడూరు పట్టణ టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరోల్ అనేది జీవిత ఖైదీలకు ఇచ్చే ఒక హక్కు అని అది వారి కుటుంబ సభ్యులు ఖైదీగా ఉన్న తల్లి ఆరోగ్యం సరిగా లేదంటూ గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోగ మానవతా దృక్పదంతో జీవిత ఖైదు అనుభవిస్తున్న అవిలేల శ్రీకాంత్ పెరోల్‌కి నేను లేఖ ఇచ్చినట్లు తెలిపారు. అయితే తాను ఇచ్చిన సిఫార్సు లెటర్ ప్రభుత్వం రిజెక్ట్ చేసిందని ఆ వివరాలను సమావేశంలో చూపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే గా నేను ఇచ్చిన లెటర్‌తో శ్రీకాంత్‌కి పెరోలు ఇవ్వలేదన్నారు. జీవిత ఖైదు అనుభవిస్తున్న తమ కుమారుడికి పెరోల్ ఇప్పించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తే లేఖ ఇచ్చానని అధికారులు పరిశీలించి అప్పట్లోనే రద్దు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి మట్టి పూసే ప్రయత్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో రౌడీయిజాన్నికూటమి ప్రభుత్వం ఉపేక్షించదని ప్పటికే పలుమార్లు పోలీసు అధికారులకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలు వచ్చి కష్టాలు చెప్పుకుంటే మావతా దృకపదంతో లేఖలు ఇస్తానే తప్ప వేరే ఉద్దేశ్యం లేదన్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో పెరోలు ఎవరు సిఫార్సు చేస్తే ఇచ్చారో ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని తెలిపారు. తప్పు చేసిన వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది.

## ప్రపంచ దోమల నివారణ దినోత్సవ ర్యాలీ

తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ : ప్రపంచ దోమల దినోత్సవం-2025 సందర్భంగా బుధవారం తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి డాక్టర్ శైలజ, డి ల్యాటో అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి కె రూప్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి స్థానిక రామకృష్ణ సర్కిల్ మీదుగా దోమల నిర్మూలన అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు అనంతరం డిఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో మానవహారం నిర్మించి నినాదాలు చేశారు చివరగా డాక్టర్ శైలజ డి ల్యాటో దోమల దినోత్సవం సందర్భంగా ఆరోగ్య భద్రత అనే సంకల్పంతో దోమలు లేని గ్రామం దోమలు లేని నగరం నిర్మాణం కోసం కృషి చేస్తానని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుటలో నా వంతు పాత్ర పోషిస్తానని ప్రతిజ్ఞను అందరి చేత చేయించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిసిఎస్ డాక్టర్ మురళీకృష్ణ, డిఎస్ఓ డాక్టర్ రెడ్డి ప్రసాదు పిఓ డాక్టర్ మధు ఇతర వైద్యాధికారులు, డిప్యూటీ డెమో, డిఎంహెచ్ఓ కార్యాలయం సిబ్బంది, ఎస్ యు ఓ లు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాలు స్థానిక నర్సింగ్ కళాశాల నర్సింగ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐక్య పోరాటాలతో సమస్యలను సాధించుకుందాం

### - జిల్లా వీఆర్ఏల అసోసియేషన్ అధ్యక్షులు కోదండన్ పిలుపు



చిత్తూరు, మేజర్‌న్యూస్ : ఐక్య పోరాటాలతోనే తమ న్యాయ పరమైన సమస్యలను సాధించు కుందామని విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్స్ (వీఆర్ఏ) అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి కోదండన్ పిలుపుని చ్చారు. బుధవారం స్థానిక రెవిన్యూ భవన్ లో వీఆర్ఏల అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు కోదండన్ అధ్యక్షతన చిత్తూరు డివిజన్‌తో పాటు ఆయా మండలాల వీఆర్ఏల అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. కాగా ఈ సమావేశంలో రాష్ట్ర వీఆర్ఏల అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వై. లక్ష్మణ్, చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. ఇర్ఫాన్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ దేవరాజ్, చిత్తూరు డివిజన్ అధ్యక్షులు పెరు మాల్, డివిజన్ ప్రతినిధులు ఉదయ్, రూపాణి, వినాయక, అఫ్జల్, నరేష్, దామోదర్, పలమనేరు డివిజన్ అధ్యక్షులు మోహన్, డివిజన్ ప్రతినిధులు మునికుమార్, వాసు, ఖాదర్‌బాషా, శివ, సుమంత్, నగరి డివిజన్ అధ్యక్షులు లోకనాథ, డివిజన్ ప్రతినిధులు వెం కటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, కుప్పం డివిజన్ నుంచి రమణ, శివప్ప, మాలశ్రీ, గణేష్, చందన, తులసమ్మ, తిరుపతి జిల్లా రేణిగుంట మండలం నుండి నాగరాజు, వెంకటరమణతో పాటు అన్ని మండలాల వీఆర్ఏల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఐటిఐ లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, మేజర్‌న్యూస్: వెదురుకుప్పం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిఐ ప్రధానాచార్యులు జి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులుఆగస్టు 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఆగస్టు 27 తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తమ సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్లనువెరిఫై చేయించుకున్న విద్యార్థులుఆగస్టు 29 ఉదయం 10 గంటలకు వెదురుకుప్పం ఐటిఐ నందు జరుగు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

## తవణంపల్లి ఎమ్మార్వో సుధాకర్ విధి నిర్వహణలో ఆణిముత్యం



తవణంపల్లి, మేజర్‌న్యూస్: తవణంపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఎమ్మార్వోగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్, తన పనితీరుతో ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పట్ల విశ్వాసం పెంచేలా ఆయన చేసిన కృషి విశేషమైంది. రెవిన్యూ విభాగం అంటే సాధారణ ప్రజలకెప్పుడూ కఠినమైన అనుభవమే. కానీ సుధాకర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రజలు తన సమస్యలకు వెంటనే స్పందన దొరుకుతుందని భావించి ధైర్యంగా కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఐరాలలో ఎమ్మార్వోగా పనిచేసిన కాలంలోనే ఆయన క్రమశిక్షణ, కఠిన నిర్ణయాలు, ప్రజల సమస్యల పరిష్కారంలో చూపిన చొరవతో అందరి మనసులు గెలుచుకున్నారు. బదిలీ అయిన క్షణం నుండి ఆయన తవణంపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి స్థానిక సమస్యలు, భూ వివాదాలు, ప్రభుత్వ భూములపై అక్రమాలు వంటి వాటిపై ప్రత్యక్ష సమాచారాన్ని సేకరించారు. రైతులు, పేదలు, మధ్య తరగతి ప్రజల సమస్యలను శ్రద్ధగా వింటూ వాటికి తగిన పరిష్కారం చూపించడం సుధాకర్ ప్రత్యేకత. తన విధుల్లో ఎక్కడా రాజీ పడకుండా కఠినంగా, కానీ న్యాయంగా వ్యవహరించడం ఆయన లక్షణం. సుధాకర్ పనితీరులో ఒక ముఖ్య అంశం పారదర్శకత. ప్రతి నిర్ణయం, ప్రతి ఫైలు, ప్రతి చర్యలో ప్రజలకు స్పష్టత ఉండేలా చూసుకుంటారు. లంచం, అవినీతికి ఆయన వద్ద చోటు లేదని స్థానికులు చెబుతున్నారు. తవణంపల్లి ప్రజలు "మా సమస్యకు తక్షణమే పరిష్కారం చూపే అధికారి సుధాకర్ అని గర్వంగా చెబుతున్నారు. "ఇలాంటి అధికారుల వల్లే ప్రభుత్వంపై మనకు విశ్వాసం పెరుగుతుంది" అని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



గూడూరు, మేజర్‌న్యూస్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు మండలం విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హై స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బుధవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో 45 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని దాతల సహాయంతో నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అక్కన రమణయ్య తెలిపారు. లయన్స్ క్లబ్ చదువు వైద్యానికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేయడానికి ఎన్నో విధాలుగా ముందుంటుందని తెలియజేశారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని భవిష్యత్తును ఆనందంగా తీర్చిదిద్దుకోవాలని తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే సేవ భావాన్ని కూడా పెంపొందించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రావూరి రవిచంద్ర రెడ్డి ట్రెజరర్ పప్పు వీరేంద్రనాథ్ సీనియర్ లైన్స్ ఎంజెఎఫ్ మల్లెమాల మురళి రెడ్డి ఎంజెఎఫ్ లయన్ రామ్మోహన్ రావు లయన్ రూపేష్ రెడ్డి లయన్ కలగట్ల శివయ్య లయన్ జక్కం రెడ్డి శ్రీనివాస్ రెడ్డి లయన్ జోసెఫ్ లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని జయప్రదం చేశారు.

# వేణుగోపాలస్వామివారి ఆలయంలో పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సుప్రభాత సేవతో మేల్కొల్పి,



శుద్ధి తోమాల కొలువు మొదటి గంట సర్వదర్శనం, ఉత్సవర్ల సమర్పణ తిరుమంజనం పాలు పెరుగు తేనె హరిద్రవం చందనం తో కూడిన స్వామివారికి తిరుమంజల నిర్వహించారు అనంతరం వేద ఘోష, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల మూలవర్లకు, ఉత్సవ మూర్తులకు, గరుడాళ్వారుకు, పరివార దేవతలకు పవిత్ర మాలలు సమర్పణ సాయంత్రం 5.30 గంటలకు తిరువీధి ఉత్సవం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. సాయంత్రం స్వామివారు తిరుచి వాహనంపై సర్వాంగ సుందరంగా అలంకరించి వేద పండితులు మంత్రోచ్చారణమా అంగ రంగ వైభవంగా ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు భక్తులు కర్పూర హారతులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈఓ రవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్ కంకణ భట్టాచార్యులు మురళీకృష్ణ, ప్రధాన అర్చకుల గోపాల ఆచార్యులు, శబరి రమేష్ శ్రీహర్ష, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.







# పూర్ణాహుతితో ఘనంగా ముగిసిన సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం

**తిరుమల, మేజర్‌న్యూస్:** భక్తుల ఐశ్వర్యం, ఆయురారోగ్య సంపదలు కాంక్షిస్తూ తిరుమల ధర్మగిరిలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన



సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ఘనంగా ముగిసింది. మొత్తం 32 మంది వేదపండితుల సమక్షంలో జరిగిన ఈ మహాయాగంలో వేదపారాయణం, సుందరకాండ పారాయణం తదితర వైదిక క్రతువులు జరిగాయి. ఈ యాగానికి హాజరైన టీటీడీ ఈఓ జె.శ్యామలరావు మాట్లాడుతూ సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం వైభవంగా ముగిసిందని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టీటీడీ నిర్ణయం తీసుకుందని అన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ మహాయాగంలో టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, ఎస్వీ వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## వాకాడుకు నేడు జిల్లా కలెక్టర్ రాక

**వాకాడు, మేజర్‌న్యూస్:**

మండల కేంద్రమైన వాకాడుకు గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ రానున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు ఆయన రానున్నట్లు బుధవారం రెవెన్యూ అధికారులు తెలిపారు. వాకాడులోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, రానున్న వర్షాకాలం సందర్భంగా బ్యారేజీఎత్తును, విపత్తు జరిగే చోట పొర్లుకట్లను పరిశీలించేందుకు కలెక్టర్ వస్తున్నారని అధికారులు తెలిపారు.



## విద్యార్థులు పరిశోధనాత్మకంగా ముందుకు సాగాలి

**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్:** తిరుపతి ఐఐటి బ్యూరో ఆఫ్ఇండియన్ స్టాండర్డ్స్ సహకారంతో ఫ్యాకల్టీ సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అవగాహన ఒప్పందంలో భాగంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సహకారంతో హాఫ్-డే ఫ్యాకల్టీ సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించింది.



ఈ కార్యక్రమం అధ్యాపకులు, పరిశోధనా పండితులు విద్యార్థులలో ప్రామాణీకరణ యొక్క కీలక పాత్ర ప్రస్తుత అందుబాటులో ఉన్న సహకార అవకాశాలు గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశ జాతీయ ప్రమాణాలు సంస్థ బహుముఖ పనిపట్ల విద్యాసమాజాన్ని సున్నితం చేయడం పరిశోధన పాఠ్యాంశాల్లో ప్రమాణాలను రూపొందించడం ఏకీకరణలో చురుకుగా పాల్గొనడాన్ని ప్రోత్సహించడం ఈ చొరవ దృష్టి సారించింది. తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ ప్రమాణాలు రోజువారీ ఔచిత్యాన్ని నొక్కి చెప్పారు. తన సివిల్ ఇంజనీరింగ్ అధ్యయనాలు సమయంలో భారతీయ ప్రమాణాలను ఉపయోగించడంలో తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. అధ్యాపకులు విద్యార్థులు ప్రామాణీకరణ పర్యావరణ వ్యవస్థకు తోడ్పడాలన్నారు. శాస్త్రవేత్త డైరెక్టర్ చిన్మయ్ ద్వివేది, 1947లో ప్రారంభమైనప్పటి నుండి యొక్క వారసత్వాన్ని భారతదేశ ప్రమాణాలు ప్రకృతి దృశ్యాన్ని రూపొందించడంలో కీలక పాత్రను హైలైట్ చేశారు. ఐఐటితిరుపతిలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అధిపతి కోసం నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ చిమలకొండ జాతీయ ప్రపంచస్థాయిలో ఉపయోగపడే ప్రమాణాలను కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో అవకాశాలను సృష్టించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రామాణీకరణ రంగంలో ఐఐటీ తిరుపతి విద్యా నైపుణ్యాన్ని ఉపయోగించుకునే లక్ష్యంతో, ఎంఓయూ అమలుపై వ్యూహాత్మక చర్చ ప్రణాళికతో కార్యక్రమం నిర్వహించారు.


జనం కోసమే

నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు

నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

| కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232 | ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116 |
|---|---|


# ఎన్‌సీసీ యూనిట్లను పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్

**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** తిరుపతి ఎన్‌సీసీ యూనిటీను ఏపీ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలాని బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం అంతట శిక్షణ పరిపాలన ఎన్సిసి కార్యకలాపాలు సజావుగా నిర్వహించడంలో తిరుపతి ఎన్సిసి యూనిట్ వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఎన్సిసి సామాజిక సమాజసేవ కార్యక్రమాలకు అర్థవంతంగా దోహదపడుతుందని క్యాడెట్లలో వ్యక్తిత్వం నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి చేసిన నిజాయితీ ప్రయత్నాలను ఆయన పేర్కొన్నారు. దేశంలో క్రమశిక్షణ నమ్మకం బాధ్యతా యుతమైన పౌరులను రూపొందించడంలో ఎన్సిసి కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్యతో పాటు శరీరక దృఢత్వం అలవడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గ్రూప్ కమాండర్ సతేందర్ దహియా, ఆయా యూనిట్ల ఎన్సిసి అధికారులు సైనికులు పాల్గొన్నారు.





## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో చిత్తూరు జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.

పూతలపట్టు నియోజకవర్గం :
1.బంగారుపాళ్యం, 2.పూతలపట్టు

కుప్పం నియోజకవర్గం :
1. రామకుప్పం.

పలమనేరు నియోజకవర్గం :
1.గంగవరం, 2.బైరెడ్డిపల్లి

| కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232 | ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116 |
|---|---|

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



**గూడూరు, మేజర్‌న్యూస్:** రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బుధవారం ఉదయం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన సంస్కరణలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు, యువతకు 18 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఓటుహక్కు కల్పించడం వంటి సంస్కరణలు తీసుకువచ్చి ప్రజాస్వామ్యంలో భాగసామ్యులను చేయడం, ఆయన తీసుకొని వచ్చిన సాంకేతిక విప్లవాన్ని నేడు అనుభవిస్తున్నామని అన్నారు. ఆయన లేని లోటు కాంగ్రెస్ పార్టీకి తీరనిదని రాజీవ్ గాంధీ చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూల చంద్రశేఖర్, రాష్ట్ర బిసి సంఘం నాయకులు గుంటమడుగు సుబ్బరామరాజు. రావూరి బ్రహ్మయ్య, చిల్లకూరు మండలం అధ్యక్షుడు చిల్లకూరు వేమయ్య, నాయకులు మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి శ్రద్ధాంజలి

**- కాంగ్రెస్ నేత తలపా దామోదర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్ :** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి తెలంగాణ నివాళులర్పించారు. భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి. వారు మాట్లాడుతూ భారతదేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబం వారిదని భారత దేశ సాంకేతిక విప్లవానికి ఆద్యుడు స్వర్గీయ రాజీవ్ గాంధీని అతి చిన్న వయసులో ప్రధాని పదవి చేపట్టి పేద ప్రజలు అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి విద్యావ్యవస్థలో సమూలమైనటువంటి మార్పులకు కారకుడైన మహనీయుడు స్వర్గీయ రాజీవ్ గాంధీని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాం, నాగరాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జమాలుల్లాహ్



**గూడూరు, మేజర్‌న్యూస్:** ముస్లిం ఐక్య వేదిక మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన షేక్ జమాలుల్లాహ్ ఎంపికయ్యారు. ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధులు సయ్యద్ ఖలీల్ అహ్మద్, షౌకత్, రాష్ట్ర సమన్వయ కర్త ఎస్ఎం. రషీద్ చేతులమీదుగా బుధవారం తిరుపతిలో నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మైనారిటీల సమస్యలపై స్పందించే జమాలుల్లా ముస్లిం ఐక్య వేదిక కుటుంబంలో సభ్యుడు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు నిజాముద్దీన్, గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆర్ఎస్కే. జీలాని బాషా తదితరులు ఉన్నారు.

## ప్రపంచ దోమల దినోత్సవం

**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** మండలంలోని కత్తెరపల్లి పంచాయితీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ భువనేశ్వరి ఆధ్వర్యం వైద్య ఆరోగ్య సిబ్బంది రాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమల వలన కలిగే వ్యాధుల పై అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని చెప్పారు.దోమల వలన మలేరియా, చికెన్ గున్యా, డెంగీ,మెదడువాపు వంటి వ్యాధులు కలిగే ప్రమాదం ఉంటుందని, తెలిపారు. దోమలు పుట్టకుండా,దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి,నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. అందరూ దోమతెరలు వాడుకొని దోమకాటు నుండి రక్షణ పొందాలని తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సిబ్బంది చేత దోమల నిర్మూలన పై ప్రతిజ్ఞ చేయించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు.ఈ కార్యక్రమం లో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మండలం డి.ఎం పురం పంచాయతీ పరిధిలో ఉన్న కరవాట కంద్రిగ గ్రామం నుండి మచ్చల పట్టాభి వర్ధంతి సందర్భంగా అతని భార్య రాజమ్మ , వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు కుమార్తెలు.శైలజ, ఎం. దీప్తి, కిషోర్ యాదవ్, నరేష్, మరియు మనవళ్లు, మనవరాలు, ముక్తశ్రీ ,ధీరజ్ ,దీక్షిత్, దిశాంత్, లోకియాన్, వృద్ధాశ్రమంలో వృద్ధులు సూపర్వైజర్ ప్రకాష్ పాల్గొనడం పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ఫోరం ఫర్ అంగన్వాడీ యూనియన్



**పలమనేరు మేజర్‌న్యూస్:** ఎన్నో ఏళ్ల నుండి అంగన్వాడి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా రూపాంతరం చెందాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చేసిన పోరాటాలు ప్రస్తుత రాష్ట్రములో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకొని మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా ప్రమోట్ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఫోరం పర్ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్, మినీ వర్కర్స్ యూనియన్ తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. అందులో భాగంగా బుధవారం పలమనేరు పట్టణములో యూనియన్ నాయకురాలు నాగరత్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ వర్కర్లు మెయిన్ వర్కర్ల తో సమానంగా పనిచేస్తూ వేతనం మాత్రం 7000 రూపాయలు తీసుకొని కష్టాలతో కుటుంబాలు పోషించుకునే వారని అంగన్వాడీలు చేసిన పోరాటం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కనికరించి జిఓ ఆర్ టి నెంబర్ 116 ప్రకారం ప్రమోట్ చేయడం వలన రాష్ట్రవ్యాప్తంగా 4687 మినీ వర్కర్లు మెయిన్ వర్కర్లతో పాటు 11,500 వేతనం తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినందుకు సంతోషం వ్యక్తపరిచారు. ఎన్నికలప్పుడు కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో అంగన్వాడీ సమస్యల పైన ఫోరం ఫర్ అంగనవాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ముందుండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాణి, చిలకమ్మా, నిర్మల, రెడ్డమ్మ, సరస్వతి, భారతి, రేణుక, వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.



## తెలుగుదేశం ప్రభుత్వంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి

**- తెలుగుదేశం నేత రెడ్డివారి గురువారెడ్డి**

**ఏర్పేడు మేజర్‌న్యూస్:** ఏర్పేడు మండలం బందారుపల్లి గ్రామంలో మహిళా సంఘాలు జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు సృష్టికర్త ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మహిళలు స్వశక్తితో ఎదగాలని ఆకాంక్షించి వాళ్ళని డ్వాక్రా సంఘాల ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేసి ఆర్థికంగా వారి కాళ్ళ మీద వారు నిలబడే విధంగా స్ఫూర్తినిచ్చి ముందుకు నడిపిస్తున్నటువంటి నాయకుడు నారా చంద్రబాబు నాయుడు, మరి అదేవిధంగా మీకోసమే ప్రత్యేకంగా డ్వాక్రా సంఘాల శాఖను క్యాబినెట్లో ఏర్పాటు చేసిన ఘనత ఆనాటి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అటువంటి చంద్రబాబు నాయకత్వంలో మీరు ఇంకా బలోపేతమై ముందుకు పోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. గతంలో 2019లో అధికారం ఉన్న సమయంలో పసుపు కుంకుమ కార్యక్రమాన్ని మీకు అందజేసిన ఘనత నారా చంద్రబాబునాయుడుది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి. మండల స్థాయి అధికారులు ఏపీఎం సిసి సచివాలయ సిబ్బంది సంఘ మిత్రాలు మునిమ్మ, మహిళా సంఘాలు సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

## పలమనేరు విద్యార్థుల ఘనత



**పలమనేరు మేజర్ న్యూస్:** పలమనేరు విద్యార్థుల ఘనత యు సి ఎం ఏ ఎస్ నేషనల్ లెవల్ పోటీల లో మెరిసిన 9 మంది ప్రతిభావంతులు హైదరాబాద్ లోని బాలయోగి స్టేడియంలో ఆగస్టు 16, 17 తేదీల్లో జరిగిన యు. సి. ఎం.ఏ. ఎస్. నేషనల్ లెవల్ పోటీలలో పలమనేరు విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. దేశవ్యాప్తంగా 6000 మందికి పైగా విద్యార్థులు పోటీపడిన ఈ జాతీయ స్థాయి వేదికపై పలమనేరు నుంచి పాల్గొన్న 9 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో ట్రోఫీలు గెలుచుకుని విశేష కీర్తి సాధించారు.విజయం సాధించిన విద్యార్థులు ప్రద్యుమ్న సాయి, హిబా హనియా, దక్ష, శ్రీరామ్, యువన్ సాయి, అశ్విన్, శ్రేష్ట సుజన్ కుమార్, రుషిత, పలమనేరు పట్టణం నుండి జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరచడం ద్వారా విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మాత్రమే కాకుండా మొత్తం పలమనేరు ప్రజలకు గర్వకారణమయ్యారు. ఈ సందర్భంగా యు సి. ఎం.ఏ. ఎస్ ఫ్రాంచైజ్ డైరెక్టర్ పి. రాజేశ్వరరావు, పి.తేజస్విని మాట్లాడుతూ.... "పలమనేరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణం ఈ విజయాలు మరింత ఉన్నత శిఖరాలకు దారి చూపుతాయి. భవిష్యత్తులో ఇంకా గొప్ప స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

## ఎంజీఎం పాఠశాలకు వస్తువుల వితరణ



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** బైరాగి పట్టెడలోని డాక్టర్ డి.రామానాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు రూ.1,15,000 వేలు కంప్యూటర్, ర్యాక్స్, బీరువా, టేబుల్ ను ఐడీబీఐ బ్యాంక్ ఎ ఏజీఎం శ్యాంసుందర్ అందజేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఐడీబీఐ బ్యాంక్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు మరింత చొరవ తీసుకొని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంక్ అన్నమయ్య సర్కిల్ బ్రాంచ్ మేనేజర్ సురేష్. రాజేష్, ఐటీసెల్ ధనంజేయులు, భవిత కోఆర్డినేటర్ చంద్రశేఖర్, క్లస్టర్ హెచ్ఎమ్ పరంధామనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమాద్రి బాబు, ఎంజీఎం ఉపాధ్యాయులు బండి మధుసూదన్ రెడ్డి, పి రేణుకాదేవి, కదిరి రవి, షబానా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఈనెల నెల 23 న ఒంగోలు జిల్లాల్లో జరిగే సిపిఐ బహిరంగ సభకు తరలిరండి

**- 28 వ సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లు ను విడుదల చేసిన సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు**



**పలమనేరు మేజర్‌న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర 28 మహాసభలు ఆగస్టు నెల 23 నుండి 25 వరకు ఒంగోలులో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పలమనేరు గంగమ్మ తోపు సిపిఐ కార్యాలయం వద్ద పలమనేరు సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ... భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్26 ఏర్పాటు నుండి నేటి వరకు అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలు జిల్లాలో ఆగస్టు 23 నుండి 25 వరకు జరుగుతున్నది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, కార్మికులు రైతులు ఉద్యోగులు మహిళలు యువజనలో విద్యార్థుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని పోరాటాలకు వేదిక కానున్న మహాసభలు జయప్రదం కోసం పలమనేరు గంగమ్మ తోపు సిపిఐ కార్యాలయం వద్ద పోస్టర్లు విడుదల కార్యక్రమాన్ని చేపట్టారు. 23వ తేదీన ఒంగోలు జిల్లాలో పెద్ద ఎత్తున జరిగే బహిరంగ సభకు పలమనేరు నియోజకవర్గం నుండి సిపిఐ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా,జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కే.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర సమితి సిపిఐ ప్రధాన కార్యదర్శి ప్రస్తుత ఎమ్మెల్యే కూనం సాంబశివరావు తో పాటు జాతీయ,రాష్ట్ర సిపిఐ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు పట్టణ సిపిఐ కార్యదర్శి బుర్ర మంజునాథ్ బాబు, సిపిఐ నాయకులు వి. రమేష్,టి. శంకరప్ప,పి. శాంతమ్మ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## తోతాపురి మామిడి రైతులకు ముఖ్యగమనిక

**కార్వేటినగరం మేజర్ న్యూస్):** పైన తెలిపిన షెడ్యూల్ టైం ప్రకారం అన్ని రైతు సేవ కేంద్రాల్లో మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలు కి తోలిన రైతులు మీ రైతు సేవ కేంద్రం వద్దకు మీ యొక్క ఆధార్ కార్డ్, పొలంపాస్బుక్, బ్యాంక్ బుక్, మామిడి తోలిన ఖాటా బిల్లు తప్పనిసరిగా గ్రామ సభలకు తీసుకుని వచ్చి మీ యొక్క వివరములు తప్పనిసరిగా సరిచూసుకొనవలెను, గ్రామసభలు కి తప్పనిసరిగా రావాలి, మీ యొక్క డేటా సరి చూసుకోవాల్సిన బాధ్యత మీదే, మీ అన్ని వివరాలు కరెక్టుగా ఉంటేనే మీకు మామిడి సబ్సిడీ నగదు జమ అవుతాయి. మండల వ్యవసాయ అధికారిణి, హేమలత, మండల తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పుష్పిత్ ఐరన్ కంపెనీలో కార్మికుడి మృతి

**ఏర్పేడు, మేజర్న్యూస్:** ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలో ఉన్న పుష్పిత్ కంపెనీలో పనిచేయుచున్న మేర్లపాక నివాసి మహేష్ 45 యువకుడు డ్యూటీ లోనే సొమ్ము సిల్లి పడిపోవడం జరిగింది. కర్మాగారంలో మెకానిక్ గా పనిచేసే ఇతను పనిచేసే క్రమంలో అలసిపోయి సొమ్మసిల్లి పడిపోయరు, రేణిగుంట సమీపంలో ఓ పెద్ద హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మరణించడం జరిగిందని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని నిలదీయగా యాజమాన్యం వారు ఎలాంటి సమాధానం లేదు. దినిపై గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ విషయంపై న్యాయం చేయాలని కోరుతున్నారు. మృతునికి భార్య పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మహేష్ మృతితో ఆ కుటుంబం వీధిన పడిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## 24 నుంచి అమరావతి ఛాంపియన్షిప్ పోటీలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్న్యూస్:** ఈనెల 24 నుంచి 3 రోజులు పాటు తిరుపతి వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకమైన అమరావతి ఛాంపియన్షిప్ 2025 పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్‌డేను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు తారకరామా స్టేడియం ఆతిధ్యమిస్తుందని తెలియజేశారు. జిల్లా స్థాయి, జోనల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు చేరుకున్నారని వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో 2వేల మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి క్రీడాశాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం వేదికగా ఈనెల 29న జరిగే నేషనల్ స్పోర్ట్స్‌డేకు సీఎం చంద్రబాబు నాయుడు హాజరవుతారని, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని తెలియజేశారు.



## డ్రోన్లతో నిర్మానుష్య ప్రాంతాల్లోనూ గస్తీ

**ఓజిలి, మేజర్న్యూస్:** శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఆధునిక సాంకేతికతను తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు, సీఐ సంగమేశ్వరరావు ఆదేశాల మేరకు ఓజిలి ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలోడ్రోన్లను వినియోగిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలకు ముఖ్యంగా నిర్మానుష్య ప్రాంతాలు, శివార్లలోపేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్లతో ప్రత్యేక నిఘ పెట్టారు. మండలంలోని బుధవారం గ్రద్దగుంట , మనవాలి తదితర గ్రామ శివారుల్లో డ్రోన్ ద్వారా పరిసరాలలోని ఐసోలేటెడ్ ప్రాంతాలలో ఓపెన్ డ్రింకింగ్, ఈవ్ టీజింగ్, మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై, చెడు నడవడిక కలిగిన వ్యక్తుల ఉక్కు పాదం మోపారు. డీఎస్పీ చెంచుబాబు సీఐ సంగమేశ్వరరావు ఆదేశాల మేరకు ఓజిలి ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రౌండ్లను ఎగరవేశారు. క్షేత్రస్థాయిలో నేరాల నియంత్రణకు డ్రోన్లు క్రియాశీలకంగా ఉపయోగిస్తున్నామని ఎస్సై శ్రీకాంత్తెలిపారు. ఓపెన్ డ్రింకింగ్, గంజాయి, పేకాట, కోడి పందేల నియంత్రణ, అరికట్టవచ్చని తెలియజేశారు.





## ముగిసిన జాతీయ సదస్సు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్న్యూస్:** శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో రాష్ట్రీయ పశు వ్యాధి నిర్ధారణ డాక్టర్ డి.రాణి ప్రమీల, డీబీటీ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విసి టీవీ రమణ మాట్లాడారు. పశువులలో మనుషులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి నిర్మూలించేందుకు సవాళ్లు గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన తమిళనాడుకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కె.కుమనన్, హర్యాణాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ జిందాల్, పరిశోధన విభాగం డైరెక్టర్ శ్రీలత హాజరయ్యారు. ఈ వర్క్ షాప్ లో డిబిటి నెట్వర్క్ ప్రాజెక్ట్ సంబంధించిన వివిధ అనుబంధ సంస్థలు ప్రతినిధులు హాజరై వారి అనుభవాలను పంచుకున్నారు.

## వేము ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే





**చిత్తూరు క్రైం, మేజర్న్యూస్:** చిత్తూరు జిల్లా వేము ఇంజనీరింగ్ కళా శాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం కళాశాల నందు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు విచ్చేయడం విద్యార్థుల్లో విశేష ఉత్సాహాన్ని నింపింది. ఎస్పీ మాట్లాడుతూ మొదటగా కొత్తగా అడుగుపెడుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతిక విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, విద్యార్థి దశలో క్రమశిక్షణ, సమయ పాలన, కృషి అనేవి ఎంత ముఖ్యమో వివరించారు. “విద్య అనేది మన భవిష్యత్తును మలిచే శక్తివంతమైన ఆయుధం, దాన్ని సద్వినియోగం చేసుకుంటే మాత్రమే మనం మంచి ఇంజనీర్లుగా, మంచి పౌరులుగా ఎదగగలమని స్పష్టం చేశారు. తాను కూడా ఇంజనీరింగ్ చదివిన విద్యార్థినేనని గుర్తు చేసుకున్నారు. ఆ కాలంలో ఎదురైన సవాళ్లు, తరగతి గదుల్లో గడిపిన మధుర జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. నేటి పరిస్థితుల్లో సైబర్‌క్రైమ్, డ్రగ్స్ వాడకం వంటి ముప్పులు విద్యార్థులను దారి తప్పిస్తున్నాయని, వాటినుంచి దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులు, అధ్యాపకుల కృషిని వృథా చేయకుండా సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా, నైతిక విలువలు, నిజాయితీ, సేవా భావం కూడా వ్యక్తిత్వ నిర్మాణంలో అంతే ముఖ్యమని విద్యార్థులకు బోధించారు. ఎస్పీ సాన్నిధ్యం విద్యార్థులకు ఒక గొప్ప ప్రేరణ అని కళాశాల యాజమాన్యం ప్రశంసించారు. అనంతరం కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపకులు ఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

## హథీరాంజీ మఠం భవనం పరిరక్షిస్తాం:సంపత్ నాయక్



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్** శ్రీవారికి అత్యంత ప్రియ భక్తుడుగా గుర్తింపు పొందిన శ్రీస్వామి హథీరాంజీ మఠం భవనాన్ని పరిరక్షిస్తూ బంజారాల భావితరాలకు అందించాలని, ఆ దిశగా బంజారాలు ఏకమై మఠం భవనం పరిరక్షించుకొని భావితరాలకు అందించాలని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు, ఓయూ జేఏసీ అధ్యక్షులు సంపత్ నాయక్ పిలుపునిచ్చారు. గాంధీ రోడ్డులోని మఠం భవనాన్ని బంజారా సంఘం నాయకులు బుక్కే శివ నాయక్ తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బంజారా ప్రజలకు ఆరాధ్య దైవంగా పిలవబడే శ్రీస్వామి హథీరాం బావాజీ జ్ఞాపకాలను చెరిపేందుకు కుట్రలు పనితే సహించేది లేదని హెచ్చరించారు. బావాజీ జ్ఞాపకార్థం తిరుపతిలో మఠం భవనం అలాగే ఉండేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే సాయంత్రం ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు కలిసి వినతి సమర్పించారు. హథీరాంజీ మఠం భవనాన్ని కూల్చేందుకు ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు.

ఈ కార్యక్రమంలో హథీరాంజీ మఠం పరిరక్షణ సమితి జాతీయ కన్వీనర్ శివా నాయక్, అశోక్ నాయక్, హరి పాల్గొన్నారు.

## వికలాంగులకు రద్దు చేసిన పింఛన్లు కొనసాగించాలి..సిపిఐ

**పుత్తూరు, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 14 నెలల కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని రాష్ట్రంలో 30 వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం చాలా దుర్మార్గమని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా పుత్తూరు అంబేద్కర్ భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చెప్పటింది. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం పోయి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం పోయి వికలాంగుల నోరు కొట్టే విధంగా రాష్ట్రంలో 30 వేల మంది వికలాంగుల పెన్షన్లు రద్దు చేయడం చాలా దుర్మార్గమని వెంటనే వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేయాలని లేని పక్షంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ శ్రీకారం చుడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతి కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి పుత్తూరు ప్రాంతం కార్యదర్శి మహేష్ ఏఐటియుసి నాయకులు చంద్రబాబు గోపి శరవణ కృష్ణారెడ్డి రమేష్ రమణ వెంకటరత్నం సల్వా రాజా చారి బాబు తదితరులు పాల్గొన్నారు.




## వైసీపీ ఫేక్ ప్రచారాల ఫ్యాక్టరీ

**శాంతిపురం, మేజర్న్యూస్:** వైసీపీ ఫేక్ ప్రచారాల కు కాదేది అనర్హం అన్నట్టుగా ఉందని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. వారి ఫేక్ ప్రచారాలు ఈ విధంగా ఉన్నాయని పత్రికలు తెలియజేశారు.70 గేట్లలో ఒక్కటి మొరాయించి, మిగిలిన 69 గేట్ల ద్వారా వరదనీరు స్వేచ్ఛగా దిగువకు పోతున్నా సరే ‘పనిచేయని గేటు... విజయవాడ మునిగిపోతుందని ప్రచారం. అమరావతిని వరద నుంచి కాపాడేందుకు నీటిని మళ్లించి పొన్నూరును ముంచేశారని ప్రచారం. బుడమేరుకి వరద వచ్చింది అని, ఆ నీటిని పొలాలకు తరలించి పొలాలు ముంచేశారని ప్రచారం. మామిడి రైతులకు దేశంలో ఎక్కడలేని విధంగా గిట్టుబాటు ధర కల్పించిన తప్పుడు ప్రచారం.రైతులు పాడైన పొగాకుని పొలానికి ఎరువుగా వాడుకుంటే రైతులు గిట్టుబాటు ధరలేక తొక్కించారని ప్రచారం. విశాఖలో టీసీఎస్ వంటి ప్రముఖ సంస్థలకు భూములు కేటాయిస్తే, దానిపై తప్పుడు ఆరోపణలు, కోర్టుల్లో కేసులు.ఉచిత పరిధిలోకి రాని డీలక్స్, ఏసీ బస్సుల్లో తమ కార్యకర్తలను, పెయిడ్ ఆర్టిస్టులను ఎక్కించి, చంద్రబాబు మమ్మల్ని మోసం చేశాడు” అని తిట్టిపోస్తూ ప్రచారం.తిరుపతిలో గోశాలలో ఆవులు చనిపోయాయని, తిరుమల క్యూలైన్లలో భక్తులు ఆకలితో అల్లాడిపోతున్నారని, శ్రీశైలంలో లడ్డూ ప్రసాదంలో కీటకం వచ్చిందని ప్రచారం.ఒక యాక్సిడెంట్లో చనిపోయిన పాస్టర్ ప్రవీణ్ మృతిని హత్యగా చిత్రీకరించి, దానికి ముస్లిం సమాజాన్ని ముడిపెట్టి ప్రచారం. ఇలా అసత్యలకే వైసిపి పరిమితమైందని ఎద్దేవా చేశారు.



## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జన్మదిన వేడుకలు



**సూళ్లూరుపేట మేజర్, న్యూస్** తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్ గాంధీ 81 వ జయంతి సందర్భంగా ఏఐసీసీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ మావుదూరు వెంకటాచలపతి ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ గాంధీ భారతదేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన తీసుకొచ్చిన ఎన్నో సంస్కరణలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఆయన తనయుడు రాహుల్ గాంధీ భారతదేశానికి కాబోయే ప్రధానమంత్రి అని,ఆయన ద్వారానే భారతదేశ అభివృద్ధి చెందుతుందని, భారతదేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసేందుకు ఎదురుచూస్తున్నారని, తండ్రి ఆశయాలను, సిద్ధాంతాలను నెరవేరుస్తారని, అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా చైర్మన్ ముక్కరంభాకం బాలరాజు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మ దేవదానం, పొన్నా చిన్నెయ్య తడ మండల అధ్యక్షులు అంభాకం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కుమార్ రెడ్డి,కార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**చంద్రగిరి, మేజర్ న్యూస్:** చంద్రగిరిలో నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయ పనులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం పరిశీలించారు. రెండవ అంతస్తు స్లాబ్ పనులను ఎంఎల్ఏ నాని ప్రారంభించారు. చంద్రగిరి పట్టణానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి మండల స్థాయి అధికారులు కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గత రెండు నెలల క్రితం సుమారు 3కోట్ల రూపాయలతో నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు.అనంతరం నూతన ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న పనులను పురోగతిని పరిశీలించి త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు తెలిపారు.అనంతరం గోవింద ధామంలో పనులను ఆయన పరిశీలించారు. అందరి సహకారం తీసుకొని పనులు వేగవంతం చేయాలని కమిటీ సభ్యులను కోరారు. గతంలో గోవింద ధామం కు సుమారు 50 లక్షల వరకు డబ్బులు దాతలు ప్రకటించారు.గోవింద ధామం పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ మరియు కమిటీ సభ్యులుకు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కాంట్రాక్టర్, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరి



**పెనుమూరు, మేజర్న్యూస్** వినాయక చవితిని పండుగను పురస్కరించుకొని మండలంలోని ప్రతి గ్రామస్తులు వీధుల్లో వినాయక ప్రతిమ ఏర్పాటుకు పోలీసు శాఖ నుండి అనుమతులు ఆన్లైన్ ద్వారా తీసుకోవాలని పెనుమూరు ఎస్సై వెంకట నరసింహ తెలిపారు. మండపాల పెద్ద ఎత్తున పాట కచేరీలు మ్యూజిక్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని ఆయన వివరించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోబడుతుందని ఆయన హెచ్చరించారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు.

## రేణిగుంటలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం




**రేణిగుంట మేజర్ న్యూస్:** రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ ఆవరణలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ నుండి వర్చువల్గా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని ప్రారంభోత్సవాన్ని వీక్షించారు. అనంతరం సీఎం వర్చువల్గా ప్రసంగిస్తూ డిజిటల్ టెక్నాలజీ రంగంలో కొత్త ఆవిష్కరణలకు ఈ హబ్ తోడ్పడుతుందని పేర్కొన్నారు.

## డాక్టర్ ఎం.మాదన్నకు అభినందనలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్** టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గోవిందరాజు స్వామి ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగఅధిపతి డాక్టర్ ఎం.మాదన్నకు దళిత విద్యార్థి సంఘాల నేతలు అభినందనలు తెలిపారు. డాక్టర్ ఎం.మాదన్న కళాశాలలో మూడు విభాగాలకు అధిపతిగా వ్యవహరిస్తూ ఆ విభాగాల అభివృద్ధికి కృషి చేశారు. కళాశాలలోని పరీక్షల విభాగాల నిర్వహణ బాధ్యతలను చక్కగా నిర్వహిస్తూ కళాశాల అభ్యున్నతికి ఎంతో దోహదపడ్డారు. ఆయన సేవలను గుర్తించి టిటిడి ఇటీవల నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవం వేడుకలలో యోగిత్యా ప్రశంస ప్రాంతాన్ని అందజేశారు. ఈ మేరకు బుధవారం ఎస్జీఎస్ కళాశాలలో ఆయనను భారతీయ దళిత విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కొండా యుగంధర్, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్, హరి, నాగరాజు, కళాశాల అధ్యాపక బృందం ఉదయ్, జగదీష్, మదు హరీష్ రెడ్డి, రవి, కోటేశ్వరరావు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



## జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఏపీ జట్టు



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్** ఆగస్టు 22 నుంచి 24 వరకు బీహార్ లోని బోధ గయ పట్టణంలో జరగబోయే 44వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ జాతీయ పోటీలకు ఏపీ బాలురు బాలికల జట్లు బుధవారం తిరుపతి నుంచి వెళుతున్నారని ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశు రాముడు తెలిపారు. షూటింగ్ బాల్ క్రీడా అతి తక్కువ కాలంలో ఎక్కువ ప్రాచుర్యం పొందిందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో షూటింగ్ బాలు క్రీడ అభివృద్ధి చెందిందన్నారు. భారత మంత్రిత్వ శాఖ చేత గుర్తింపు పొందిన షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ సంఘం తరపున ఈ బాల, బాలికల జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇటీవల ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన క్రీడా పాలసీలో షూటింగ్ బాల్ క్రీడను కూడా చేర్చడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. షూటింగ్ బాల్ క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

## మూడు బార్లకు లైసెన్సులు మంజూరు

**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్**



**నాయుడు పేట,మేజర్ న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లా వ్యాప్తంగా మద్యం బార్ల ఏర్పాటుకు సంబంధించి కొత్త లైసె న్సుల జారీకి చర్యలు చేపట్టింది. ఓపెన్ కేటగిరీలో 29 బార్లకు, గీత కులాల వారికి ప్రత్యేకంగా మూడు బార్లకు లైసెన్సులు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిష నర్ విజయ శేఖర్ ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. తిరుపతి డిపిఓ నాగమల్లేశ్వరరావు రెడ్డి, సిఐ అరుణ కుమారి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కొత్త బార్ల లైసెన్సుల కోసం ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ పద్ధతుల ద్వారా టెండర్లు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిష నర్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పారద ర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించబ డుతుందని, అర్హులైన అభ్యర్థులందరూ పాల్గొనవచ్చని ఆయన సూచించారు.

## గ్రాట్యుటీ ఎప్పుడు చెల్లిస్తారు ..?

**జిల్లా వైసీపీ ఉపాధ్యాయ విభాగం అధ్యక్షులు ఎన్. సోమచంద్రా రెడ్డి**



**పలమనేరు మేజర్న్యూస్** పదవీ విరమణ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు గత ఏడాది కాలంగా గ్రాట్యుటీ చెల్లించకపోవడం సమంజసం కాదని దానిని ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని వైఎస్ఆర్ పార్టీ అనుబంధ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్.సోమచంద్రా రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సహజంగా పదవీ విరమణ పొందిన వారికి పెన్షన్, కమ్యుటేషన్ గ్రాట్యుటీ ఒకేసారి చెల్లిస్తారని, అయితే 2024 ఆగస్టు తదుపరి రిటైర్డ్ అయినవారికి పెన్షన్ కమ్యూటేషన్ లు చెల్లించి గ్రాట్యుటీ పెండింగ్ లో పెట్టారన్నారు. గతంలో ఈ పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు. లీవ్ ఎన్కాష్మెంట్, డీఏ బకాయిలు గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా నాలుగు పెండింగ్ డీఏ లలో ఒకటి కూడా విడుదల చేయలేదన్నారు. గత ప్రభుత్వం మేము మరలా అధికారంలోకి వస్తే ఐ.ఆర్ తో నిమిత్తం లేకుండా 2024 జూలై నుంచి పిఆర్సీ ఇస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం ఉన్న పిఆర్సీ కమిటీని రద్దు చేసి పి.ఆర్.సీ కమిషనర్ ను యమించలేదన్నారు.వీటన్నింటిపై ప్రభుత్వం చర్యలు తీసుకొని వెంటనే గ్రాట్యుటీ ని చెల్లించాలన్నారు.

## మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన..



**శ్రీకాళహస్తి మేజర్న్యూస్ :** అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కొగిలి ముని చందు ఆధ్వర్యంలో డ్రగ్స్ . మాదకద్రవ్యాలు ప్రభావం. విద్యార్థులు ఎవరి గురించి ప్రభావం. శ్రీకాళహస్తి ఎస్సీ బాయ్స్ హాస్టల్ లో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి విచ్చేయడం జరిగింది వారు మాట్లాడుతూ నేడు యువతరం మొత్తం ఇటువంటి మాదకద్రవ్యాలు చేతిలో కట్టు బానిసలు అవుతున్నారు. వీటి వాడకంతో మతిస్థిమితం లేకుండా చేయరాని తప్పులు చేస్తూ నేరస్తులు అవుతున్నారు. మాదకద్రవ్యాలు వాడకం వల్ల చిన్నతనంలో ప్రాణాలు సైతం కోల్పోతూ తల్లిదండ్రులకు చెరగని మచ్చగా నిలుస్తుంది అన్నారు. విద్యార్థి దశలోనే తమ బంగారు భవిష్యత్తును ఎటువైపు తీసుకువెళ్లాలో ఆలోచించి బాగా చదువుకుని సమాజానికి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాల్సిన విద్యార్థులు నేడు మద్యం మత్తులో కన్న తల్లిదండ్రులను సైతం హింసించడానికి ఏమాత్రం ఆలోచించడం లేదు. ఇటువంటి ప్రమాదకరమైన మాదకద్రవ్యాలను మనదేశంలోకే అనుమతించకుండా ప్రభుత్వాధికారులందరూ ఎక్కడికక్కడ నిగా వేస్తూ విధులను నిర్వహిస్తున్నా మెరుపు వేగంతో దేశమంతటా వ్యాపిస్తున్నాయి. మాదకద్రవ్యాలను విద్యార్థులు సైతం తిప్పి కొట్టాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్ అభి, హాస్టల్ వార్డెన్ సుమన్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.